
శ్రీసచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై! సద్గురు శ్రీసాయినాథుని శరద్బాబూజీ కీ జై!

# గురుకృప

ప్రేమకు హద్దులెక్కడ... అనుగ్రహానికి అవధులెక్కడ...




మన మనసెరిగిన వారు
మనలో మనమై వున్నారు
ఎరిగిన వారి ఎదలో వున్నారు
ఎరుగని వారి ఎదురే వున్నారు
మధుర మధురతర నాముడు
సాయినాథుడు...

తలచిన వారికి తలపుగ
పిలిచిన వారికి పిలుపుగా
మన మన(స)ములో కొలువై
మన ప్రభువై వున్నారు...
సాయినాథుడు...



సాయి దర్శనంతో కాకాజీ సుఖసంపన్నులైనారు. అతని చిత్తంలో చిన్మయ జ్యోతులు వెలిగాయి. ఆనందం చిందులు వేసింది. బాబా అత్యంత కృపను వర్షించడంతో అతని మనసు నిశ్చింతగా అయింది. అతని మనసులోని చాంచల్యం నశించిపోయింది. అతను అబ్బురపడసాగాడు. తనను తానే ప్రశ్నించుకున్నాడు. ఈయన (కరుణ) కరణి ఎంత అద్భుతం! ఒక్క మాట కూడా మాట్లాడలేదు. ఏమి ప్రశ్నించను లేదు, ఆశీర్వాదం కూడా ఇవ్వలేదు. కేవలం ఈయన దర్శనంతోనే సుఖం కలిగింది. మనసులోని చాంచల్యం పోయింది. నాకు అలౌకిక ఆనందం సమృద్ధిగా ప్రాప్తించింది. దీన్నే దర్శన మహిమ అంటారు కాబోలు.

- సాయి సచ్ఛరిత్ర ఓవి 64-91

సంపుటి : 15
జూలై 3

# గురుకృప

సంచిక : 4
2012



## సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి.
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయ కుహరంలోని నిశ్శబ్ద నిశీథిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞాన సౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృత ధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృత ధారలలో తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ, 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏక కంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధుర స్వప్నం.
ఆ స్వప్న సాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్య ప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

- శ్రీబాబూజీ



### లోపలి పేజీలలో

ఆయన పేరు 'ప్రేమ' 4
- గురుకృప

సద్గురు ప్రేమ కక్ష్యలో 6
- శరశ్చంద్రికలు

నియమం 12
- శరశ్చంద్రికలు

కోపాన్ని జయించడం ఎలా? 17
- శరశ్చంద్రికలు

భవసాగర తారణ కారణహే 21
- ఈశ్వరరావు

గురుమతము 23
- గురుకృప

నిర్వహణ : ***గురూజీ ఆశీస్సులతో - గురుబంధువులు***
GURUKRUPA, 2-1-6, Gandhi Chowk, Tenali-01.
Ph : 93933 61778
Printed at : Ramakrishna Printers, Visakhapatnam.

# ఆయన పేరు 'ప్రేమ'



'ప్రేమ' అన్న పదం తలపుకు వస్తే సాయిభక్తుల స్మృతిపథంలో తళుక్కున మెరిసే రూపం, స్ఫురణలో నిలిచే ఆనంద స్వరూపం శ్రీబాబూజీ. ఆధ్యాత్మికత మొత్తాన్ని ఒక్కమాటలో నిర్వచిస్తే అది "ప్రేమను పొందడం... ప్రేమను వ్యక్తీకరించడం... అంతే" అంటారు శ్రీబాబూజీ. శ్రీబాబూజీ జీవితం మొత్తం దేనికి అంకితం అంటే "శ్రీసాయిద్వారా తాను పొందిన ప్రేమను, శ్రీసాయి ప్రసాదమైన తన బిడ్డలకు పంచడానికే".

***అవ్యాజమైన ప్రేమ... అంబరమంత ప్రేమ....***

ఎందరో కవిశేఖరులు కవితలల్లారు 'ప్రేమ' మీద. ఈ జగతిన 'తల్లి' ప్రేమను మించినది లేదని కొందరి అభిప్రాయం. ఇక అక్క, చెల్లి, తమ్ముడు, అన్న... ఇలా బంధాలు, జీవన సంబంధాలు, షరతులతో కూడిన 'ప్రేమ'లనే ఆనందావేశాలు, సన్నివేశాలు. తల్లి తన బిడ్డపై వున్న మమకారంతో తప్పు, ఒప్పుల మీమాంసకు తెరదించి తన బిడ్డనే మాధుర్యంగా చూసుకుంటుంది. ఇక గురువు విషయానికొద్దాం. రక్తం పంచుకుపుట్టింది లేదు, పంచివ్వడానికి మనదగ్గర ఏమీ లేదు, సాటి జీవుల పట్ల మమతను చూపే పరిణితి లేదు. కానీ వారి 'ప్రేమ'కు అందరూ అర్హులే! సద్గురు ప్రేమకు వ్యాజము (కారణము) లేదు. సరి! మరి ఏమి వుంది అంటారా? 'ప్రేమ' మాత్రమే వుంది. ప్రేమ తప్ప మరేదీ లేదు. ఆయనకు మనపై వున్న ప్రేమ ఎంతంటే... శ్రీసాయిని పిచ్చిఫకీరుగా భావించి స్కూలుకు పోయే చిన్నారులు రాళ్ళు రువ్వితే , వారు స్కూలు నుంచి ఇంటికి తిరిగి వెళ్లేటపుడు ఆ చిన్నారుల అభిరుచికి తగిన పదార్థాలను వారి కోసంగా ఎంచి, పంచేంత 'ప్రేమ'. ఒక చిన్న సందర్భం గుర్తొచ్చింది. దక్షిణేశ్వరంలో వున్నపుడు రామకృష్ణుల వద్దకు వచ్చే ఒక యువకుడు శారదామాత వద్దకు కూడా వెళుతుండేవాడు. ఆ యువకుడు కొంత అనైతిక ప్రవర్తన కలవాడు. ఇది గమనించిన గురుదేవులు ఆ యువకుణ్ణి దూరంగా వుంచాల్సిందిగా కోరారు. అప్పుడు శారదామాత "నా వద్దకు వచ్చే బిడ్డకు మురికి పట్టి అపరిశుభ్రంగా వుంటే, శుభ్రం చేయాల్సిన బాధ్యత తల్లిగా నాపై వుంది" అని వినయంగా చెప్పారు. ఈ మాటల మూటలు ఎన్ని కడితే సద్గురుని ప్రేమను వర్ణించగలుగుతామో! అజ్ఞానం కదా! ఇంకా ఒక చక్కటి సందర్భం గుర్తు చేసుకుందాం... ఒక సాయిభక్తురాలు శ్రీబాబూజీని ఇలా వేడుకుంది.. "గురువుగారూ మీరేం చేస్తారో నాకు తెలియదు. ఇంక అయిదు నిమిషాల్లో ఏ బాధ లేకుండా కాన్పు అయిపోవాలి" అని. నిజంగానే ఆ 'తల్లి'కి నొప్పులు లేకుండానే ప్రసవమయింది. పండంటి బిడ్డ పుట్టాడు. నొప్పులు గురుదేవులకు, పండంటి బిడ్డలు వారి 'బిడ్డలకు'. ఇదీ అంబరమంత ప్రేమంటే! శ్రీబాబూజీని అంటిపెట్టుకున్న ఎందరో భక్తుల అనుభవం ఇది. శ్రీసాయితత్త్వాన్ని గ్రహించని, గుర్తించని వారిపై కూడా వారు వర్షించిన ప్రేమానుగ్రహపు జల్లు ఆ వ్యక్తులను సాయిదరికి చేర్చింది. మిత్రు, శత్రు భేదం లేని ప్రేమశిఖరమే తాను. కేవలం వెతలు, వెలుతులతోనే జీవితాన్ని చీకటిగా చూసుకునే మనందరిపై 'వెలుగు'ను విరజిమ్మి, సాయి అనే 'ప్రేమ' సామ్రాజ్యానికి మనల్ని చేయి పట్టుకు తోడ్కొని పోయి సాయి ప్రేమాంబరాన్ని తనివితీరా దర్శింపచేసి, ఆ ఆనందామృతాన్ని అందరికీ పంచాలన్న సత్సంకల్పమే, సత్యమే, సద్గురువే శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ.

## సద్గురు ప్రేమ సుధే... సంస్కరించే బోధ...



జగత్తును తన కనుసన్నలతో నడిపించే పరమాత్మ ఒక సాధారణ మనిషిగా, ఓ గురువుగా, మన మధ్య జన్మించి, మనలా కష్టాలు పడి, మనకై తన జీవితమంతా తపించి, అపార ప్రేమను కురిపించి, అనుక్షణము కంటికి రెప్పలా కాపాడే ఆ సద్గురు చంద్రుని ప్రేమకు ప్రతిగా ఏం చేయాలి? ఏమిచ్చి ఆ 'ఋషిరుణం' తీర్చుకోవాలని ఆలోచిస్తే – వారి జీవనశైలిని స్ఫురణలో నిలుపుకొని, వారు ఆచరణతో చూపిన బోధను అవగతపరచుకొని అనుగుణంగా ఆచరించడం, అలా బాబా తత్త్వాన్ని నలుగురికి పంచి, వారిచేత ఆచరింపచేయడమే.

సద్గురుని సద్దర్శనం చేసుకోని జీవుల కోణంలో చూస్తే మహామహిమాన్వితమైన సద్గురు తత్త్వం కేవలం 'కోర్కెల'ను తీర్చే కల్పతరువుగా దర్శనమిస్తుంది. అవగతమైతే ప్రణాళికాబద్ధమైన సద్గురు పథం బిడ్డల కోర్కెలనే మిషలుగా, సోపానాలుగా మలచి 'సద్గురుప్రేమ'కు శరణాగతుని చేస్తుంది. ఇది ప్రేమాలయం – పరిపూర్ణ సంస్కరణాలయం.

## ప్రేమామృతరాశి... పరి'పూర్ణ' అనుగ్రహ 'శశి'

శ్రీబాబూజీని దర్శించిన ఎన్నో కోణాలు... మహామహులు వారిని గూర్చి నిర్వచించిన జీవన సత్యాలు.. ఎందరో పండితులు అబ్బురపడిన వారి జ్ఞాన వైవిధ్యాలు. ఇవన్నీ ఒక ఎత్తయితే ఒక సాధారణ మానవునిలో కూడా ఆలోచన రేకెత్తించేది వారికి బాబా పట్ల వున్న 'ప్రేమ'. తన ఉచ్ఛ్వాసతో సాయి ప్రేమను అనుభవించి, నిశ్వాసలో సాయి ప్రేమను పంచి, తన జీవిత పర్యంతం 'సాయి'ని ప్రతిబింబించిన సాయి ప్రేమామృతరాశి శ్రీబాబూజీ. సుమారు మూడు దశాబ్దాల క్రితం అతి తక్కువ మంది వారిని కలిసే ఆ రోజుల్లో శ్రీసాయిపట్ల వున్న ప్రేమ, సాయితత్త్వం పట్ల వారికి వున్న ఆశయాలు, సాయిపథానికి వారు వేసిన బాట, చెప్పిన మాట, వారి మాటల్లో వున్న ఆ వేడి, వడి, తపన – ఈ మూడు దశాబ్దాలలో ఎన్నో వేలమంది వారిని సద్గురువుగా కొలుస్తున్న ఈ రోజులు... వారి మాటల్లో ఏ మార్పు లేదు. సాయిపట్ల వారి అంకితభావం, సాయి శరణాగతి పథంలో అందరూ పయనించాలన్న వారి తహతహ, వీటన్నింటికి పునాది వారు ఆస్వాదించి, అనుభవించిన సాయి'ప్రేమే'.

ఇన్ని సంవత్సరాల సాయిపథయానంలో మనమందరం ఆ ప్రేమను చవిచూసాం. శ్రీబాబూజీ అనే ప్రేమామృతరాశి మనలను వారి చెంతకు చేర్చుకొని జీవితాలను అందంగా మలచి, ఆనందంతో నింపారు. పొందిన ఆ ప్రేమను ఇక అందరితో పంచుకుందాం.. పంచుకోవాలంటే మనం ఆ సద్గురుచంద్రుని పట్ల 'ప్రేమ'ను పెంచుకోవాలి. ఈ చిన్న అడుగుకు 'గురుపూర్ణిమ' కంటే సుదినమేముంది. **ప్రేమను పొందడం.. ఆస్వాదించడం.. ప్రేమించడం.. పంచడం.. 'ప్రేమ'... ఇక మరేదీ లేదు.**

**– గురుకృప**

*పూజ్య గురుదేవులచే సాయిపథానికి 'భీష్మాచార్యునిగా' కొనియాడబడ్డ గురుబంధువు శ్రీయుతులు పెద్ద గుప్తాగారు మే 21వ తేదీ 2012న సాయి చరణాలలో ఐక్యం అయ్యారు. ఎన్ని జన్మల (సం)బంధమో ఎందరో గురుబంధువులు, కుటుంబాలు, గుప్తాగారు మిషగా గురుచరణసన్నిధిని చేరి జీవితాలను ఆనందమయం చేసుకున్నారు. వారి జీవితంలోని ప్రతీక్షణాన్ని గురుదేవుల అనుగ్రహఫలంగా వ్యక్తం చేసేవారు గుప్తాగారు. వయసులో పెద్దవారైనా గురుదేవుల చెంత ఒక చిన్న పిల్లాడిలా వారు వ్యక్తం చేసే సందేహాలు – వాటికి గురుదేవుల చతురోక్తులు, ఎంతకాలం గడిచినా మరిచేవి కావు.* ***గురువును గుర్తించిన గుప్తాగారు ధన్యజీవి.***



# శరచ్చంద్రికలు

## సద్గురు ప్రేమ కక్ష్యలో- ఏప్రిల్ 2012

**గురువుగారు :** మీరు ఈ ప్రశ్నను చాలాసార్లు అడిగారు – "అసలు ఇక్కడ ఏమి జరుగుతుంది? మీ మార్గం ఏమిటి? ఇది శరణాగతి పథమే కదా? ఇది ప్రేమ మార్గమే కదా? అలా కాకపోతే మరి ఈ మార్గమేమిటి? అసలు ఏమి జరుగుతోంది!" (గురువుగారు నవ్వుతూ)... ఏమీ జరుగుతున్నట్లు కనిపించడం లేదు కదూ – అది నిజమే! అయస్కాంతానికి, ఇనుపముక్కకు సంబంధించిన ఉదాహరణను నేను మీకు ఇంతకు ముందు చెప్పాను. మళ్లీ మరొకసారి చెబుతాను. మనమంతా ఆ ఇనుపముక్కల్లాంటి వాళ్లం. అయస్కాంతానికి, ఇనుపముక్కకు వున్న తేడా ఏమిటి? అయస్కాంతం విషయంలో దానిలోని అణువులన్నీ క్రమపద్ధతిలో సరిగ్గా ధ్రువీకృతమై వుంటాయి. ప్రతి అణువుకు ఉత్తరధృవం, దక్షిణధృవం వుంటాయి – వాస్తవానికి అవి అలా ధ్రువీకృతం కావించబడి వుంటాయి. అదే ఇనుపముక్కలో అణువులు ధ్రువీకృతమై వుండవు, అక్కడ ధృవాలు గానీ, క్రమంగానీ వుండదు. కాబట్టి ప్రతి అణువు యొక్క అయస్కాంత క్షేత్రానికి మరొక అణువు అయస్కాంత క్షేత్రం ప్రతికూలంగా పనిచేస్తుంది, ప్రతిఘటిస్తుంది. నిజానికి ఇనుములోని ప్రతి అణువు అయస్కాంతతత్వాన్ని కలిగివుంటుంది. అక్కడ అయస్కాంత శక్తి వుంటుంది కానీ అది వ్యక్తం కాదు, నిరోధింపబడుతుంది; అది అణిచివేయబడుతుంది. అయస్కాంతంలో అది వేరేవిధంగా వుంటుంది. భౌతికంగా చూస్తే అది సరిగ్గా ఇనుము మాదిరిగానే వుంటుంది – మార్పేమీ వుండదు – కానీ ప్రతి అణువు ఓ క్రమపద్ధతిలో, అమరికతో ఉత్తరం నుండి దక్షిణం వైపుకు ధ్రువీకృతమై, కేంద్రీకరింపబడి వుంటుంది. మన అంతరంగంలో, మనం కూడా ఆ ఇనుప అణువుల మాదిరిగానే వుంటాం. మనలో ఓ క్రమంగానీ, కూర్పుగాని లేని చాలారకాల ఆకర్షణలున్నాయి – ఈ ఆకర్షణలు, కోరికలన్నీ ఒకదానితో ఒకటి సంఘర్షించేటటువంటి అణువుల వంటివి. "నాకు డబ్బు కావాలి, నాకు సౌఖ్యాలు కావాలి, మంచి ఇల్లు కావాలి, నేను కుటుంబంతో కలిసుండాలి. పశ్చిమదేశాలలోని సౌకర్యాలను నేను అనుభవించాలి. నాకు ఆధ్యాత్మిక ఆనందానుభూతి కావాలి, నాకు నిర్వాణం కావాలి". ఇలా మనకు ఎన్నో ఒకదానితో ఒకటి సమన్వయపడని కోరికలు పరస్పరం వ్యతిరేక దిశల నుండి మనల్ని లాగుతుంటాయి. ఇలా వివిధ రకాల పాశాలు మనల్ని వివిధ దశల నుండి లాగుతూ వుండటం వలన ఆ అయస్కాంతతత్వం లేకుండా పోతుంది. కాబట్టి ఓ ఇనుపముక్కను అయస్కాంతం చేయడం ఎలా? దానిని నిరంతరం అయస్కాంతాన్ని – సద్గురువును – అంటిపెట్టుకుని ఉండేలా చేయడం ద్వారా, అయస్కాంతం మీద తిరిగి తిరిగి రుద్దడం ద్వారా దానిని అయస్కాంతంలా చెయ్యవచ్చు. సద్గురువులో నిబిడీకృతమైన అయస్కాంతతత్వం క్రమంగా మనలో వున్న వివిధ రకాల ఆకర్షణలను ధ్రువీకృతం చేస్తుంది. అంతేకాని, అణువుల సంఖ్యలో ఎటువంటి మార్పువుండదు. ఒకవేళ ఆ ఇనుపముక్కలో పదిలక్షల అణువులున్నా యనుకుంటే వాటి సంఖ్య ఒక్కటి



ఎక్కువా కాదు, ఒక్కటి తక్కువా కాదు. అక్కడ సరిగ్గా అదే సంఖ్యలో అణువులుంటాయి. కానీ వాటి దిశ మారుతుంది, వాటి దృక్పథం మారుతుంది, అవి సరైన పద్ధతిలో ధ్రువీకృతమవుతాయి, సమన్వయం పొందుతాయి. అవి ఓ క్రమంలో కూర్చబడతాయి. అక్కడ ఈ ఇనుపముక్క ఎటువంటి ఆధ్యాత్మిక అభ్యాసాలు, పద్ధతులు, సాధనలు చేసింది? అసలు ఏమైనా చేసిందా? ఏమైనా మారిందా? వాస్తవానికి, అది మార్పుచెందింది, అది ఒక అయస్కాంతంగా మారింది. కానీ ఆ పరివర్తన ఎక్కడ సంభవించింది? ఏం జరిగింది? మార్పు తెచ్చింది ఇనుపముక్కనా లేక అయస్కాంతమా? మనం బట్టలు ఉతికి ఎండలో దండెంపై ఆరేస్తాం. అవి ఆరిపోతాయి. ఎలా? ఎండలో వుంచడం వలన, అంతే. అవి ఎండలోనే వుండాలి. మీరు వాటిని ఇంట్లోనో, లేకపోతే ఓ నీళ్ల బక్కెట్‌లోనో వుంచితే అవి ఆరతాయా? ఆరవు. మన ప్రయత్నమంతా వాటిని బయట ఎండలో తీగపై వేయడం వరకే. ఇక్కడ కూడా ఇనుపముక్క చేయవలసిన ప్రయత్నమల్లా అయస్కాంతంతో నిరంతర సాంగత్యంలో వుండటమే, ఒక్కసారి మాత్రమే కాదు తరచుగా వుండాలి. “నేను ఓసారి చేసాను, కానీ ఏం జరగలేదు!” – అది అలా జరుగదు! ఆ పరిణామక్రమంలో ఇనుపముక్క కొంత అసౌకర్యానికి లోనై “అయ్యో భగవంతుడా, ఇది బాగా ఇబ్బందిగా వుంది, నాకది అవసరం లేదు” అనవచ్చు. మళ్లీ మీరు ప్రయత్నిస్తారు. ముందు ఏదో కోల్పోతున్నట్లు అనిపించవచ్చు. కానీ కొంతకాలం తరువాత ఇనుపముక్క ఏమీ కోల్పోవడం లేదని మీరు తెలుసుకుంటారు. ఇంకా అదనంగా ఏదో తోడవడం లేదు – గోళ్లు కానీ, వెంట్రుకలుకానీ, ఏమీ కొత్తగా తోడవడం లేదు (గురువుగారు నవ్వుతూ) మీరు అంతకు ముందు ఎలా వున్నారో అలానే వున్నారు, కానీ ఏదో మార్పు కలిగింది. మీరు అయస్కాంతంలా అయిపోతున్నారు.

**భక్తుడు :** అంటే (మనలో) ప్రతి కోరిక తప్పనిసరిగా సద్గురు ప్రేమకోసమై వుండాలా?

**గురువుగారు :** అక్కడ జరిగేది అదే. మీకు ఉద్యోగం కావాలి, మీకు బాబా పట్ల గల ప్రేమకు అది అడ్డం కాదు. “బాబా, నాకు ఉద్యోగం కావాలి”, అని మీరు అడుగుతారు. ఉద్యోగం వచ్చినపుడు బాబా పట్ల మీకు గల ప్రేమ పెరుగుతుంది. “బాబా నాకు ఉద్యోగం ఇచ్చారు” అంటారు. మీకు ఆరోగ్యం బాగాలేదు, “నాకు ఆరోగ్యం కుదుటపడాలి” అని మీరు బాబాను అడుగుతారు, మీరు ఆరోగ్యవంతులవుతారు. “బాబా నాకు ఆరోగ్యం ఇచ్చారు” అంటారు. అక్కడ ఎటువంటి సంఘర్షణ వుండదు. మీ ఆరోగ్యం, మీరు అడగడం, బాబా ఇవ్వడం... అన్న ఓ చక్కని కూర్పుతో వుంటాయి. అవి చక్కని పొందికతో అమరి వుంటాయి. కాబట్టి మన జీవితం మొత్తం మనం చేసే ప్రతిదీ, అన్నీ క్రమంగా మార్పు చెంది ఆ వైపుకు (బాబా వైపుకు) కేంద్రీకరించబడుతాయి. మనం కోల్పోయేది ఏమీ వుండదు. మారేది కూడా ఏమీ వుండదు. కానీ మొత్తం బాబావైపుకే కేంద్రీకృతమై వుంటుంది. అప్పుడు మనం అనుకునే ఆ ఆధ్యాత్మిక పరిణతీ, మనం అనుకునే ఆ అయస్కాంతతత్వం కూడా వస్తాయి. కానీ అది ఏదో కోల్పోవడం వలన మాత్రం కాదు. కాబట్టి మార్గం ఆనందంగా వుంటుంది – ఇదీ నేను చెప్పేది. నువ్వు దానిని ఇనుపముక్క



అయస్కాంతానికి శరణాగతి కావడం అంటావా? లేకపోతే అది ఇనుపముక్క కావడం వల్ల తనను తాను అయస్కాంతంగా మార్చుకుంది అనంటావా? లేదూ... ఏమీ చెయ్యకుండా వున్నప్పటికి అయస్కాంతమే ఇనుపముక్కను మరో అయస్కాంతంగా చెయ్యగలదా? కాదు, అది ఆ సాంగత్య ప్రభావం – మనల్ని మనం అటువంటి సాంగత్యంలో వుంచుకోవడమే కావాల్సింది.

**గురువుగారు :** "మీలో స్వతహాగానే దివ్యత్వం వుంది; మీరది, మీరిది" అని చెబుతుంటారు, కానీ నిజానికది మనకు తెలియదు. అదేదో మనలో వుంది కానీ మనకది అనుభవంలోనికి రాదు. ఇనుపముక్క స్వతహాగానే ఒక అయస్కాంతం కూడా. కానీ దాని అయస్కాంతతత్వాన్ని అది వ్యక్తపరచడంగాని, అనుభూతి చెందడంగాని, చేయదు. ఓ ఇనుపముక్క అయస్కాంతంగా ఎలా మారుతుందో మన విషయంలో కూడా అలానే వుంటుంది. దానికి మార్గమేమిటంటే మనం ముందు ఒక అయస్కాంతంకోసం అన్వేషించాలి – మన విషయంలో అయస్కాంతమంటే సద్గురువు. అయస్కాంతానికి అంటే సద్గురువుకు – దానిని అన్వేషించేవానికి గల తేడా ఏమిటి? మౌలికమైన తేడా ఏమిటంటే – అయస్కాంతంలోని క్రమత, అది సాధించిన సమన్వయం – ఇక్కడ ఇనుపముక్కలో వుండవు. అందుకనే సద్గురువువైపు నుండి చూస్తే ఆయనకంతా సమంగానే వుంటుంది. ఆయన ఆ పరిపూర్ణ సామరస్యాన్ని సాధించారు. అందుకే ఆయన ఏ బేధాన్ని చూడరు. కానీ సాధకుని దృక్పథంలో మాత్రం "లేదు, లేదు, లేదు! మేమంతా ఇనుపముక్కలం, మీరు అయస్కాంతం" అంటారు.

**భక్తుడు :** ఆ అయస్కాంత శక్తి ప్రేమ వంటిదేనా?

**గురువుగారు :** అవును ప్రేమే. ఒక ఇనుపముక్క అయస్కాంతంవైపుకు ఆకర్షింపబడినట్టుగానే, సాధకుడు సద్గురువువైపుకు లాగబడతాడు. మనిషి అనే ఈ ఇనుపముక్కలో ఆ అయస్కాంతతత్వం ప్రేమలాగా అనుభవమవుతుంది.

**భక్తుడు :** సద్గురువు అయస్కాంతతత్వాన్ని ఇస్తారా?

**గురువుగారు :** అది ఇవ్వడం కాదు. అయస్కాంతతత్వం ఇనుపముక్కలో అంతకుమునుపే వుంది. ఆయన దానిని కేవలం ఉత్తేజపరుస్తారు. అలా కాకపోతే అణువుల అమరికను ఒక నిర్ణీత క్రమంలోనికి తీసుకురావడం మాత్రం చేతనే సాధకుడు తను మొదటి నుంచే అయస్కాంతమని గ్రహిస్తాడు.

**గురువుగారు :** ఇనుపముక్కను అయస్కాంతంగా చేసేదెలా? నువ్వు దేనినైతే అయస్కాంతం అనుకుంటావో నిరంతరం దాని సాంగత్యంలో వుంచడం వలన. మనకు బాబానే ఆ అయస్కాంతం. మానసికంగా ఆయనకు చేరువగా వుండటానికి ప్రయత్నించండి. వీలైతే భౌతికంగా కూడా ఆయనతో సన్నిహితంగా వుండండి. రమణమహర్షి వంటి గొప్ప మహాత్ములు కూడా బోధించింది అదే. వాస్తవానికి రమణమహర్షి చాలా రమణీయంగా అరుణాచలాన్ని అయస్కాంత పర్వతం అన్నారు. ఆయన ఎంతగా ఆకర్షితులయ్యారంటే

అక్కడికి వచ్చిన తరువాత ఆయన ఆ ప్రదేశాన్ని మరి వదిలిపెట్టలేదు, ఆయన తామే ఒక అయస్కాంతంగా మారిన తరువాత కూడా ఆయన దానిని వదలలేదు. అరుణాచలం ఆయన అయస్కాంతం. ఓ ఇనుపముక్కలాగా దానిని ఆయన అంటిపెట్టుకున్నారు. రమణమహర్షి వంటి గొప్ప సిద్ధులు, మహాత్ముల యొక్క ఆచరణ ఇలా వున్నపుడు, మన సంగతేంటి? ఆయన ఎప్పుడూ తమ సద్గురువు పాదాల చెంతనే వుండాల్సిన అవసరముందా? "ఇది నా గురుస్థానం, నేను ఇక్కడే వుంటాను" అని బాబా తమ గురువు సమాధి వద్దనే వుండిపోవాల్సిన అవసరముందా? వారు మనకు దారి చూపించారు; మీ గురువే మీ అయస్కాంతం అని. బాబా మనందరి అయస్కాంతం. మనకు బాబా గురువు. మనమందరం ఇనుపముక్కల వంటి వాళ్లం. మన చేతలతో, ఆలోచనలతో మనకున్న సమస్తంతో ఆ అయస్కాంతాన్ని అంటిపెట్టుకుందాం – అప్పుడు మనమూ అలా తయారవుదాం! అర్థమైందా?



**భక్తుడు :** సద్గురువు యొక్క ప్రత్యక్ష సన్నిధిలో వుండలేనివారికి, సద్గురువును నిరంతరం అంటిపెట్టుకుని వుండడానికి గల ఇతర మార్గాల గురించి, వాటిలోని ఆంతర్యం గురించి కాస్త వివరిస్తారా?

**గురువుగారు :** నిజంగా అంటిపెట్టుకుని వుండటమంటే ఆ అయస్కాంతక్షేత్రంలో వుండటమే. నిజానికి ఇనుపముక్కను అయస్కాంతంగా మార్చేది ఆ అయస్కాంతం కాదు, దాని క్షేత్రం. కొంతమందికి సద్గురు సాన్నిధ్యం దొరకనపుడు, వారికి ఓ ప్రచోదకం (Extender) కావాలి. ఉదాహరణకు, కంప్యూటర్ వుందనుకుందాం. వైర్‌లెస్ మోడెం ఎక్కడో మొదటి అంతస్తులో వుందనుకుందాం, మీకిక్కడ దాని సిగ్నల్ అందదు. అప్పుడు మీరు ఏం చేస్తారు? ఇక్కడ తరంగశక్తిని పెంచడానికి మరొక మోడెం పెడతారు, అది ఆ తరంగబలాన్ని మరింతగా పెంచుతుంది, అంతే, అది ఏదైనా సరే, మిమ్మల్ని ఆ తరంగక్షేత్రంలో వుంచగలగాలి. మీరు ఆ క్షేత్రంలో వున్నారా? ఆ విషయం ఎవరికి వారు రకరకాల మార్గాల్లో అన్వేషించుకోవాలి. నేను వాటిని ఫలానా అని చెప్పదలచుకోవట్లేదు. నేను చెప్పేది వినడానికి బదులు మీరే అన్వేషించండి.

**భక్తుడు :** అంటే మీ ఉద్దేశ్యం ఆ శక్తి క్షేత్రంలో అనా?

**గురువుగారు :** అవును, ఆ పోలికలో అది శక్తి క్షేత్రమే. అది మరొకటి కూడా కావచ్చు. అది ఓ ప్రేమ క్షేత్రం కూడా కావచ్చు. ఎందుకంటే నిజానికి ఇక్కడ ప్రభావితం చేసేది ఆ ప్రేమే. ఇనుపముక్కల విషయంలో అయితే అది కేవలం ఆ అయస్కాంత శక్తి యొక్క ఆకర్షణే. కానీ మనం ఇనుపముక్కలం కాదు, మనం మనుషులం. మనకు హృదయముంది. అందులో భావోద్వేగాలున్నాయి. మనలో ప్రేమ వుంది. మనలో ద్వేషం వుంది. కాబట్టి మనం క్షేత్రాన్ని ప్రేమ అనే భావోద్వేగంలా అనుభూతి చెందుతాం. ఎక్కడ ఆ భావోద్వేగం మరింతగా ప్రజ్వరిల్లుతుందో, అది మరింత పెరిగి బలీయమవుతుందో, మీరు ఎక్కడ దానిని మరింతగా అనుభూతి చెందగలుగుతారో, అదీ ఆ క్షేత్రం



**భక్తుడు :** ప్రతి ఒక్కరికి సద్గురు ప్రత్యక్ష సాన్నిధ్యంలో ఎల్లప్పుడూ వుండటం అవసరముంటుందా?

**గురువుగారు :** అది అవసరమైనా, కాకపోయినా – మనకున్న ఇతర పాశాల / వ్యామోహాల వలన మనం అక్కడ వుండలేము. వాస్తవంగా చెప్పాలంటే అవసరం లేదు.

**భక్తుడు :** మనస్సు సద్గురు రూపంపై లగ్నమయిన తరువాత, ఆయన చాలా దూరంలో వున్నా ఆయన శక్తి ప్రవాహం వుంటుంది కదా! కొన్ని సందర్భాలలో భక్తుడు ఎక్కడికి వెళ్లినా సరే, సద్గురువు ఆకర్షణ శక్తి కోల్పోయిన భావమే లేనటువంటి ప్రగాఢమైన గుర్తింపు వుంటుంది.

**గురువుగారు :** అలా అయితే వారు ఆ అయస్కాంత క్షేత్రంలోనే వున్నారు. మీరు చాలా మైళ్ల దూరంలో వున్నారు అనుకుంటేనే మీరు చాలా దూరంలో వున్నట్టు (నవ్వులు) కానీ మీకు గురువు యొక్క ఆకర్షణ శక్తి అక్కడ కూడా అనుభవమవుతుంటే మీరు ఆయన నుండి నిజంగా దూరంగా వెళ్లినట్టు కాదు. సద్గురువు యొక్క శక్తి అంతవరకు వ్యాపించి వుందా లేదా అనేది కాదు సమస్య. మనం దానిని అనుభూతి చెందగలుగుతున్నామా లేదా అనేదే సమస్య. ఒక అయస్కాంతాన్ని ఇనుపముక్కను కొంతదూరంలో పెడితే అక్కడ అయస్కాంత ఆకర్షణ వున్నా అది ఇనుపముక్కను దగ్గరకు లాగలేదు. మీరు వాటిని ఇంకాస్త దగ్గరకు జరిపారనుకోండి. అప్పుడు ఇనుపముక్క ఆకర్షింపబడుతుంది. దానర్థం అంతకు ముందక్కడ అయస్కాంత ఆకర్షణ లేదని కాదు, ఇనుపముక్కపై మిగతా ఆకర్షణల బలం ఎక్కువగా వుంది. అందుకని ఇనుపముక్క ఆకర్షింపబడలేదు. ఇనుపముక్కను దగ్గరకు తీసుకువచ్చిన ఆ క్షణంలో అది ఆ అయస్కాంతత్వాన్ని అనుభవిస్తుంది. బాబా స్వయంగా చెప్పింది కూడా అదే. ఆయన తమ సద్గురువు మీదనే దృష్టి నిలిపి అలా చూస్తూ 12 సంవత్సరాలపాటు కూర్చున్నారు. తాము ఎక్కడున్నాసరే తమ గురువు తమను ఎల్లప్పుడూ ప్రేమించేవారని, రక్షించేవారని బాబా చెప్పారు. ఆయన గురువు ఆయనను ఇక బయలుదేరమని చెప్పినపుడు బాబా ఆ అనుభవంతో, ఆ ఎరుకతో బయలుదేరారు.

**గురువుగారు :** ఒక ఇనుపముక్కకు – అయస్కాంతంపట్ల తనకు గల ఆకర్షణ – ప్రేమగా అనుభవమవుతుంది. ఆ ఇనుపముక్క అయస్కాంతాన్ని ప్రేమిస్తుంది. అందుకనే అది ఎప్పుడూ అయస్కాంతానికి దగ్గరగా జరుగుతూ వుంటుంది. అయస్కాంతం విషయానికి వస్తే ఇనుపముక్క తనను ప్రేమించిన దానికంటే ఎక్కువగా అది ఇనుపముక్కను ప్రేమిస్తూ వుంటుంది. అందుకనే ఇనుపముక్కను అయస్కాంతం దగ్గరకు లాక్కుంటుంది. నిజానికి దగ్గరకు లాక్కునేది అయస్కాంతమే. క్రియాశీలంగా వుండేదీ అయస్కాంతమే. కానీ అయస్కాంతం ఏ కదలికా లేకుండా వుండి, ఇనుపముక్క దానివైపుకు జరుగుతూ వుంటుంది కాబట్టి ఇనుపముక్కే క్రియాశీలంగా వున్నట్లనిపిస్తుంది. కానీ దానిని కదిలించేది అయస్కాంతమే. అందువలన అది స్థిరంగా వుంటూనే క్రియాత్మకమైనదిగా వుంటుంది. అందుకనే నాకు – రమణమహర్షి అరుణాచలాన్ని అయస్కాంతమని ఆయన చేసిన వర్ణన చాలా చక్కగా



సరిపోయిందనిపిస్తుంది. ఆయన దానిని అయస్కాంత పర్వతము అనేవారు. ఓ గొప్ప అయస్కాంతం అని చెప్పేవారు. ఈ దృష్ట్యానే ఆయన అలా చెప్పారనుకుంటాను. అరుణాచలం ఎలాగైతే ఆకర్షిస్తుందో బాబా వద్ద కూడా అలానే జరుగుతుంది. ఒకవేళ మీరు మీలోని జడత్వాన్ని, క్రమరాహిత్యాన్ని వదిలించుకుని, అయస్కాంతీకరింపబడాలని, ఆ పరిపూర్ణ సామరస్యాన్ని పొందాలని అనుకుంటే మిమ్మల్ని మీరు ఆ అయస్కాంత క్షేత్ర పరిధిలో వుంచుకోవాలి.

**భక్తుడు** : ఆ అయస్కాంత ప్రభావ క్షేత్రంలో వుంటే సరిపోతుందా లేక ఇనుపముక్క అయస్కాంతాన్ని స్పృశించాల్సిన అవసరముందా?

**గురువుగారు :** ఆ ప్రభావ క్షేత్రంలో వుంటే సరిపోతుంది. అది చాలు. మిగతాది ఆయన చూసుకుంటారు.

**భక్తుడు** : అయస్కాంతాన్ని స్పృశించనవసరం లేకుండా కేవలం ఆ కక్ష్యలో (ప్రభావక్షేత్రంలో) వుండి సంతృప్తి చెందవచ్చా?

**గురువుగారు :** ఆ అసంతృప్తి నిజంగా వుంటే, నువ్వు మరింత దగ్గర కక్ష్యలలోనికి (పరిధులలోనికి) లాగబడుతూ వుంటావు. చివరికి నువ్వు ఆ సూర్యునిలో (సద్గురువులో) కలసిపోతావు. సూర్యునితో ఏకత్వాన్ని పొందుతావు. అప్పుడు అసలు కక్ష్య (పరిధి) అంటూ ఏమీ వుండదు.

**గురువుగారు :** మీరు చెప్పినట్లు "పాక్షిక లక్ష్యాలు, చిన్న లక్ష్యాలు, స్వల్పమైన ఆకర్షణలు..' ఇలా ఇప్పుడు మీ హృదయంలో అటు ఇటు లాగుతున్న ఎన్నో కోరికలు, ఎన్నో అవసరాలు వున్నాయి. మన హృదయమంతా ఇటువంటి చిన్న చిన్న అణువులతో నిండి వుంది. కానీ ప్రతి అణువు మరొకదానితో సంఘర్షిస్తోంది. ఒక అయస్కాంతంతో సాంగత్యం ఏర్పడటం ద్వారా, ఈ అటు ఇటు లాగే ఈ విషయాలన్నీ ఓ నిర్దిష్టమైన పొందికతో, క్రమబద్ధంగా అమరుతాయి. ఏమీ కోల్పోవడం గాని, ఏదో తోడవ్వడంగాని లేకుండానే నీకు ప్రయోజనం కలుగుతుంది. నువ్వు అయస్కాంతం అయిపోతావు. ఆ అయస్కాంత శక్తిని పొందుతావు. అప్పుడు ప్రతిదీ పరిపూర్ణమయిన పొందికతో కూర్పుతో వుంటుంది. అదే అనుగ్రహం. తనకు తానుగా ఇనుపముక్క ఏమీ చేయలేని స్థితిలో లేదు, అందుకని దానికి ఒక అయస్కాంతం కావాలి. ఆ అయస్కాంతాన్నే సద్గురువు అంటారు. బాబా అటువంటి అయస్కాంతం. మనమంతా ఇనుపముక్కలం. ఆయన గురించి నిరంతరం చింతన చేయడం ద్వారా, ఆయన సాన్నిధ్యం వలన, ఆయన సాంగత్యం వలన మనమనే ఈ ఇనుపముక్కను ఆనంధభరితమైన,సంతృప్తికరమైన, సామరస్యపూరిత మార్గం ద్వారా ఒక అయస్కాంతంగా చేసుకుంటాం. పరిపూర్ణ ఆనందం పొందడమనేది మన లక్ష్యం, మనం ఆ వైపుకు వేగంగా పరిగెడుతున్నాం, మనం దానిని పొందినపుడు అది అనుగ్రహమవుతుంది. మన పరుగును అనుగ్రహంగా మలిచేటటువంటి కారకమే గురువు.



# నియమం - మే 2012

**భక్తుడు :** గురువుగారూ! ఏదైనా ఒక మంచిపనిగాని, ఒక గొప్ప పనిగాని చెయ్యడం కన్నా, ఏదైనా పనిని – ఆ పని మంచిదనిపిస్తే, దానిని నిలకడగా లేక నిరంతరాయంగా చెయ్యగలగడం ఎంతో ఉన్నతమైనదని ఎక్కడో చెప్పగా విన్నాను.

**గురువుగారు :** అవును. దానినే అందరూ నియమం అంటారు.

**భక్తుడు :** అయితే ఒక నిర్దిష్టమైన నియమం పెట్టుకోవడం యొక్క ప్రయోజనం ఏమిటి?

**గురువుగారు :** నియమం నిన్ను నీ మనస్సు చేతిలో మోసపోనివ్వదు, ఎందుకంటే అది నీకు నీ లక్ష్యాన్ని, ధ్యేయాన్ని గుర్తు చేస్తూ వుంటుంది. నువ్వు నీ లక్ష్యంవైపు మరింతగా లగ్నం కాగలవు. మనస్సెప్పుడూ ఊగిసలాడుతూ, చంచలంగా ఉంటుంది. అది "ఈ రోజు సత్సంగం వుంది... కానీ నాకు ఈ రోజు ఇంట్లోనే ధ్యానంలో కూర్చోవాలని వుంది. ఇప్పుడు వెళ్ళి మనస్సును బహిర్ముఖం చేసుకోవడం, పదిమందిలో కూర్చుని ఆ చెమట వాసన భరించడం వంటివి నాకిష్టం లేదు (నవ్వులు) అందుకే నేనివాళ సత్సంగానికి వెళ్లను, ఇంట్లోనే కూర్చుని మనస్సును అంతర్ముఖం చేసుకుంటాను" అని అనుకుంటుంది. ముందు అది అలానే మొదలవుతుంది. రెండవరోజుకు మన సంకల్పం మరింత బలహీనపడుతుంది. సత్సంగాన్ని తప్పించుకోవడానికి మన మనస్సు వేసే ఎత్తులే ఇవన్నీ. మన మనస్సును సులభంగా ఒప్పించడానికి, ముందు ఇటువంటి ఉదాత్తమైన కారణాలతోనే ఇది ప్రారంభమవుతుంది. అందుచేత అది సమర్ధనీయమనిపిస్తుంది. తరువాత రెండవరోజు ఆ వ్యక్తి నిద్రపోతాడు. మూడవరోజు సినిమాకు పోతాడు. నాలుగవ రోజు పిచ్చాపాటీ మాట్లాడుకోవడానికి వెళతాడు. ఇంక సత్సంగం ఎక్కడ? అది అంతటితో అయిపోయింది. ప్రతి విషయంలోనూ ఇలానే జరుగుతుంది. కాబట్టి నియమం నిన్ను నీ మనస్సు చేతిలో మోసపోనివ్వదు. మోసం చేసేది దేనిని? నీ లక్ష్యం నుండి దూరం చేసి నీ ఆనందం వైపుకు వెళ్లనీకుండా నిన్ను మోసం చేస్తుంది. ఇవన్నీ మనస్సు చేసే జిత్తులు. మీరు నిరంతరం సత్సంగం అనే స్థితిలో ఉండేంతవరకు నియమం అవసరం. క్రమం తప్పకుండా, ఆరునూరైనా ఆ నియమాన్ని అంటిపెట్టుకోవడమూ అవసరం.

**గురువుగారు :** నియమం అంటే – మీరు ఏమి చెయ్యాలో అది, ఒక విధివిధానం.

**భక్తుడు :** అది విధులవంటిదా లేక ప్రవర్తనా నియమావళి వంటిదా?

**గురువుగారు :** అవును. అది ఒక రకమైన ప్రవర్తనా నియమావళే. యోగశాస్త్రాలలో దానిని అలాగే నిర్వచించారు.

**భక్తుడు :** ఈ నియమాలను పాటించాలంటే ఆ పాటించే వ్యక్తికి విచక్షణాజ్ఞానం, ఎంపిక చేసుకోగల సామర్థ్యం వుండాలి కదా!



**గురువుగారు :** అందుకనే మీకు నచ్చిన లక్ష్యమంటూ ఒకటి వుండాలని నేను మీకు ఎప్పుడూ చెబుతుంటాను. మొత్తం మీద మనం చేయవలసిందల్లా, మనకు ప్రీతికరమైన ఆ విషయం మీద దృష్టి పెట్టడమే. మన దృష్టిని దాని మీద లగ్నం చేసుకోవడానికి మనం ఏమి చేయాలి? దీనిని మీరే నిర్ణయించుకోవాలి. మనం ఏం చేయకూడదు, మన దృష్టిని మరల్చేటటువంటివి ఏమిటి? అనే విచక్షణ మీకు తప్పనిసరిగా వుండాలి. మీరు ఏం చేయాలి? ఏం చేయకూడదు అని చెప్పడానికి మీకు ఏ శాస్త్రము అవసరం లేదు. ఎందుకంటే అది మీ అనుభవం కాబట్టి మీకు తెలుస్తుంది.

**భక్తుడు :** మీ ఉద్దేశ్యం అది (నియమం) ఒక రకమైన క్రమశిక్షణలా కాకుండా మన ప్రేమ వలన వస్తుందనా?

**గురువుగారు :** అవును, అప్పుడు అవి నియమ నిబంధనలలాగా, విధులలాగా కనిపించవు. అవి అలాంటివి కాదు. నేను మిమ్మల్ని "ఉదయాన్నే ఈ గోడదగ్గర నుండి ఆ గోడ దాకా పదిసార్లు నడవమని" ఊరకనే చెప్పాననుకోండి, అది ఎందుకు చేస్తున్నారో మీకు తెలియకపోయినా సరే, మీరు చేసి తీరాలి అనుకున్నపుడు అది విధి అవుతుంది. మీరు ఎందుకు చేస్తున్నారో, ఏమి చేస్తున్నారో మీకు చెప్పలేదు. కానీ ఇక్కడ మీరు నిర్ణయించుకోవాలి. ఈ పని నాకు ఇష్టమైన లక్ష్యంపట్ల దృష్టిని నిలుపుకోవడానికి ఉపయోగపడుతుందా? లేదా? అనే వివేచన ప్రతిక్షణం వుండాలి. నాలో తెలిసీతెలియనట్లుగా వున్న ఆ ఆనందమనే భావనను స్పష్టం చేసుకునేదానికి ఇది సహాయపడుతుందా? అని మనం దానిని ఎప్పుడూ తరచి చూసుకుంటూనే వుండాలి.

**గురువుగారు :** నేను 1971లో మాస్టర్‌గారిని మొదటిసారి కలుసుకున్నపుడు, ఆయన నాతో "సత్సంగం బాధ్యతలు తీసుకో" అన్నారు. దానర్థం ఏమిటంటే ఆ గదిని, బాబా ఫొటోలను సత్సంగానికి సిద్ధం చేయడం మాత్రమే. బాబా ఫొటోలు అలమరాలో వుండేవి. వాటిని బయటకు తీసిపెట్టి పూలమాలలు వేయాలి. అది మామూలు సత్సంగం. మాస్టర్‌గారు 'దీని నిర్వహణా బాధ్యతలు నీవి' అన్నారు. ఆరు సంవత్సరాలపాటు – నేను పూండీలో గడిపిన రోజులలో తప్ప' – ప్రతి గురువారం నేను ఆ బాధ్యతలు నిర్వర్తించాను. అది ఒక నియమం. కనీసం ఒక్కసారి కూడా నేను దానిని వదిలిపెట్టలేదు. ఒకవేళ వరదలు వస్తాయనుకుంటే నేను ముందుగా అయిదు గంటలకే బల్లకట్టుమీద విద్యానగర్ వెళ్లేవాడిని. గాలివానలు, తుపానుల వంటివి వచ్చినపుడు బస్సులుండేవి కాదు, నడిచే వెళ్లేవాడిని. 104, 105 డిగ్రీల జ్వరం ఉన్నా సరే వెళ్లేవాడిని. ఏం జరుగుతుంది? మహా అయితే నేను చచ్చిపోతాను. అంతేకదా! అంతకుమించి ఏదైనా జరుగుతుందా? ఏమీ జరగదు. వెళ్లాల్సిందేనని ఆ ఆరు సంవత్సరాలలో నేను ఒక్కసారి కూడా వెళ్లకుండా వుండలేదు.

నేను వెంకటగిరి వచ్చిన తరువాత కూడా, ప్రారంభంలో నేను ప్రతి గురువారం విద్యానగర్‌కు వెళ్లి



సత్సంగం చేస్తుండేవాడిని. మాస్టర్‌గారు నన్ను ఆ బాధ్యతల నుండి తప్పించేదాకా అది అలాగే కొనసాగింది. ఆయన "వద్దు, నువ్వు ఇక ఇక్కడికి రావలసిన అవసరం లేదు, వెంకటగిరిలోనే సత్సంగం చెయ్యి" అని చెప్పారు. అందుకని నేను వెంకటగిరిలో సత్సంగం ప్రారంభించి దానిని అక్కడ కొనసాగించాను. ఒక్కసారి కూడా క్రమం తప్పలేదు. నేను ఏదైనా చెయ్యాలని ఒక్కసారి అనుకుంటే... ఇక వేరే ప్రశ్న లేదు. "చనిపోవడానికి మించి ఇంకేమన్నా జరుగుతుందా? అలాంటపుడు దానికి సిద్ధంగా వుండాలి" అని అనుకునేవాడిని. నువ్వు చెయ్యాలనుకున్న దానిని చేసేస్తే ఏమీ జరిగిపోదు. అలా కాకపోతే అసలు చెయ్యాలనే అనుకోవద్దు. "దాని ద్వారా నేను ఏమి సాధిస్తాను, నేను ఎందుకు చెయ్యాలి, కోట నుండి విద్యానగర్ దాకా అంతదూరం శ్రమపడి నడిచిపోవడం ద్వారా నేను ఆధ్యాత్మికంగా ఏమైనా ప్రయోజనం పొందుతున్నానా?" ఇలా ఎప్పుడూ ఆలోచించేవాడిని కాదు (అప్పుడు నేను విద్యానగర్‌లో వుండేవాడిని కాదు, రాత్రి సమయంలో కూడా ఆరు కిలోమీటర్లు నడవాలి) నేను ఏమి పొందాను... ఏమి పొందలేదు... ఆ విషయాలన్నింటి గురించి ఆలోచించేవాడిని కాదు. ఒకవేళ ఏదైనా చేస్తుంటే దానినలా చెయ్యడమే, అంతే!

నా మనస్సు నన్ను ఎప్పుడూ మోసపుచ్చడానికి ప్రయత్నించలేదు. ఒకవేళ అది నన్ను మోసం చెయ్యాలని చూస్తే, నేను రెండు పనులు చేసేవాడిని. చలికాలంలో ఒకవేళ నేను వేకువన మూడు గంటలకు నిద్రలేచి చన్నీళ్లతో స్నానం చెయ్యాలని నిశ్చయించుకుంటే, కొన్నిసార్లు "మూడు గంటలకా... చలిగా, చాలా చలిగా వుంటుంది, అబ్బా, అయినా నేను నిద్ర లేవాలా!" అని ఆలోచన వచ్చేది. ఆ ఆలోచన నా మనస్సులోకి వచ్చినపుడు "ఓహో, నువ్వు నన్ను మోసం చెయ్యడానికి ప్రయత్నిస్తున్నావా – అయితే రా" అనుకునేవాడిని. తరువాత రోజు నేను ఏం చేసేవాడినంటే, ఓ కుండలో నీళ్లు పోసిపెట్టి, అనుకున్న దానికంటే ఇంకాస్త ముందుగా అంటే 2.45 గంటలకే లేచి గడ్డ కట్టించే ఆ చల్లని నీటితో స్నానం చేసేవాడిని. ఇంకోసారి మనస్సు కనీసం ఆ ఆలోచన చెయ్యడానికి కూడా ప్రయత్నం చెయ్యలేదు (నవ్వులు). ఆపై కనీసం అటువంటి ఆలోచన కూడా రాదు, ఎందుకంటే నేను ఏమి చేస్తానో దానికి తెలుసు. వేకువఝామున 3 గంటలకు నిద్రలేవడం, ఆ కుండలో నీళ్లతో స్నానం చేయడం ఇవన్నీ చూసి నన్ను అందరూ వెర్రివాడిననుకునేవారు (గురువుగారు చిన్నగా నవ్వుతూ..)

**భక్తుడు :** అది ఓ ప్రయత్నంలాగా అనిపించేదా?

**గురువుగారు :** అది ఏదైనా సరే, ప్రయత్నమంతా నా మనస్సు నన్ను మోసం చెయ్యకుండా చూసుకుంటూ, తక్షణం దానికి బుద్ధి చెప్పడం, అంతే! తరువాత కొంతకాలానికి అది నన్ను మోసం చెయ్యడానికి కనీసం ప్రయత్నం కూడా చెయ్యలేదు: "ఈ రోజు విద్యానగర్ బస్ మిస్సయ్యాను, సరే రేపు వెళదాంలే..." అన్న ఆలోచన వచ్చిందంటే, ఆరోజు నేను విద్యానగర్ నుండి కోటకు రెండుసార్లు నడిచేవాడిని! (గురువుగారు నవ్వుతూ) "ఆహా.. నువ్వు బస్సు మీద ఆధారపడుతున్నావుగా, సరే వుండు.. నీ సంగతి చూస్తా!"



**భక్తుడు :** ఆ మందు మనస్సు మీద పనిచేసిందా?

**గురువుగారు :** అవును, అది తప్పకుండా పనిచేస్తుంది. పనిచేయకుండా ఎందుకుంటుంది (నవ్వులు)

**భక్తుడు :** వేరే వ్యక్తికి శిక్షణ ఇచ్చినట్లు?

**గురువుగారు :** దానిని నువ్వు ఎలా పిలిచినా సరే. నేను అవన్నీ ఆలోచించేవాడిని కాదు. నేను మోసపోకూడదు అన్న ఒక్క విషయాన్నే నేను పట్టించుకునేవాడిని. వేరే వాళ్లు నన్ను మోసం చేయవచ్చు, నన్ను నేను మోసం చేసుకోవడంలో అర్థమేముంది. ఆత్మవంచన చేసుకోవడం – కనీసం నేను దానినైనా ఆపవచ్చు. అయినా ఈ విషయాలన్నీ మీకు చెప్పదలచుకోలేదు. ఇవన్నీ మీకు చాలా భయంగా అనిపిస్తాయి (నవ్వులు). ఇవన్నీ మీరు చెయ్యాల్సిన అవసరం లేదు.

**భక్తుడు :** ఆ రోజుల్లో ప్రయత్నమంటూ ఏమీ లేదంటున్నారా, ఉదాహరణకు గాలివాన వచ్చినపుడు, బస్సు రానపుడు, ఇలా...?

**గురువుగారు :** ప్రయత్నమంటూ వుంది, కానీ ఆ ప్రయత్నమంతా మనస్సు చేతిలో మోసపోకుండా వుండటం కోసమే, అంతే. అంతవరకే! నియమం గురించి, దాని విలువ గురించి, దానిని పాటించడం... వీటి గురించిన సందేహమేమీ లేదు. నేను చెప్పిన ఉదాహరణలు మన మనస్సు మనల్ని మోసం చేయకుండా చేసుకునేంతవరకే. అంతే! కేవలం అంత ప్రయత్నమే (అవసరం).

**భక్తుడు :** కానీ అప్పటి మీ ఉద్దేశ్యం మాత్రం మీ నియమానికి భంగం కలుగకూడదనే కదా?

**గురువుగారు :** అది నియమం పట్ల మాత్రమే కాదు, మిగతా విషయాలలో కూడా – మనస్సు నన్ను మోసం చెయ్యకుండా చేసుకోవడం. నియమం విషయంలో నీకు తరచి చూసుకోవడానికి ఒక ప్రమాణం వుంటుంది కాబట్టి అది స్పష్టంగా కనిపిస్తుంది. అది మనల్ని ఎక్కడ మోసం చేస్తుందో తెలుస్తుంది. అలా కాకపోతే మనకు తెలియదు. మనం మన మనస్సు చేతిలోనే మోసపోతాం. మనల్ని మోసం చేయడానికి, ప్రలోభపెట్టడానికి, మాయలో పడెయ్యడానికి వేరే వాళ్లు అవసరం లేదు; మనల్ని మనమే మోసం చేసుకోగల సమర్థులం.

**భక్తుడు :** గురువుగారూ! ఆ నియమాన్ని పాటించడం వలన అది మిమ్మల్ని మీ లక్ష్యానికి దగ్గర చేస్తుందని మీకెలా తెలుసు?

**గురువుగారు :** నాకు తెలియదు.

**భక్తుడు :** కానీ అది మీకు తప్పకుండా తెలిసే వుండాలి, లేకపోతే మీరు దానిని (నియమాన్ని) ఎందుకు అంటిపెట్టుకున్నారు?

**గురువుగారు :** నాకు తెలియదు. "నా గురువుగారు నాకు ఈ బాధ్యత అప్పగించారు" అని మాత్రమే అనుకున్నాను. అది ఆయన ఆశీర్వచనంగా భావించి నేను చేసాను. అంతే. అదే నా లక్ష్యంవైపుకు నడిపిస్తుంది.



బాబాకు సంబంధించినది ఏది చేసినా సరే అది నన్ను నా లక్ష్యంవైపుకు తీసుకెళుతుంది. అది ఎలా తీసుకెళుతుంది అన్న దాని గురించి నేను పట్టించుకోలేదు. అది ఆయన సమస్య. దాని గురించి నేనెందుకు బాధపడాలి? ఒకవేళ అది సరిపోకపోతే, అది ఆయన పొరపాటు, నా పొరపాటు కాదు (నవ్వులు) నేను మాత్రం (ఆయన చెప్పినట్టు) చేస్తాను. అంతే.

**భక్తుడు :** ఈ మధ్య సత్సంగంలో ఒకరు "ఇప్పుడు మీరు అనుభవిస్తున్న ఈ సంతృప్తిని మీరు ఎలా పొందారు?" అని మిమ్మల్ని అడిగారు. దానికి మీరు "నేను చెయ్యవలసింది చేసాను, బాబాను ప్రార్థించాను" అని చెప్పారు. మీరు ఏమి చెయ్యాలో మీకు ఎలా తెలుసు?

**గురువుగారు :** నేను చెయ్యవలసిన దాంట్లో నా ఎంపికంటూ ఏమీ లేదు, బాబా మీద దృష్టి పెట్టాలి, అంతే! అదే నేను చెయ్యవలసింది, మనం ఏదైనా చెయ్యాల్సి వచ్చినపుడు మనం ఎంపిక చేసుకునేది ఏమీ వుండదు. నాకు వేరే అవకాశం లేదు – నేను దానిని (బాబా మీద లగ్నమవడం) చెయ్యాల్సి వచ్చింది.

**భక్తుడు :** అలా మీరు బాబా మీద లగ్నం కాకుండా వుండలేకపోయేవారా?

**గురువుగారు :** అంతకు మించి నేను చెయ్యగలిగింది ఏముంది? నేను వేరే పనులు చెయ్యడానికి ప్రయత్నించాను, కానీ ఎందుకనో నా మనస్సు వాటిమీదకు పోవడంలేదని గ్రహించాను.

**భక్తుడు :** గురువుగారూ! మన పరిమితులను (బలహీనతలను) అధిగమించడానికి మనం చేసే ప్రయత్నాలు ఆ పరిమితుల నుండే వస్తాయని, కాబట్టి వాటికి కూడా పరిమితులుంటాయని చెప్పారు. క్రమశిక్షణను (మనోనిగ్రహాన్ని) వివిధ రూపాలలో సాధన చేసే చాలామంది తాత్కాలికంగా మాత్రమే తమ లక్ష్యసాధనలో సఫలీకృతం అవుతున్నారు. ఒక నియమానికి విజయవంతంగా కట్టుబడి వుండటం అనే మీ అనుభవంలో, మీరు దానిని ఎలా సాధించగలిగారు. అది ఎంతో అద్భుతంగా వున్నట్లనిపిస్తుంది.

**గురువుగారు :** ఈ నియమం నా ఆలోచనాసరళి నుంచో, నా నేపథ్యం నుండో వచ్చింది కాదు. చాలామంది దానిని కుటుంబ సంప్రదాయంగానో, ఆచార వ్యవహారాలలో భాగంగానో చేస్తారు. కానీ నేను ఎటువంటి ఆచారాలు పాటించేవాడిని కాదు. నియమాల వంటివి ఏమీ లేవు. మా కుటుంబానికి మతపరంగా కానీ, ఆధ్యాత్మిక పరంగా కానీ, భక్తిపరంగా కానీ ఎటువంటి నేపథ్యమూ లేదు (గురువుగారు నవ్వుతూ) అది నాకున్న పరిమితులలో భాగంకాదు. దానిని (నియమాన్ని) అనుసరించడం ద్వారా, నా లక్ష్యంపట్ల, దానిని చేరుకోవడం పట్ల నాకు ఎక్కువ స్పష్టత రావడానికి అది ఉపయోగపడుతుందని అనుభవపూర్వకంగా తెలుసుకున్నాను. ఇంకోరకంగా చెప్పాలంటే అది (నియమం) నాకు ఉపయోగపడుతుందని నా అనుభవం, అందుకే నేను దానిని అంటిపెట్టుకున్నాను. అందుకనే నేను లక్ష్యాన్ని (తెలుసుకోకుండా) పెట్టుకోవద్దు అని చెబుతూ వుంటాను. చాలామంది తమ లక్ష్యాన్ని తెలుసుకోకుండా, దానిని అనుభూతి చెందకుండా, తమకు ఏమి కావాలో చూసుకోకుండా – లక్ష్యాన్ని పెట్టుకోవడం అనే పొరపాటు చేస్తుంటారు. అందుకనే నేను మీ అవసరం ఏమిటో తెలుసుకోమని

చెబుతూ వుంటాను! లక్ష్యాన్ని పెట్టుకోవడం, లక్ష్యాన్ని తెలుసుకోవడం అనేవి రెండు భిన్నమైన విషయాలు.



**భక్తుడు** : మీరు మీ లక్ష్యాన్ని చేరుకునేందుకు నియమాన్నే అంటిపెట్టుకుని వుండటం మీకు ఉపయోగపడిందని మీరు అనుకుంటున్నారా?

**గురువుగారు :** దానిని నేను పాటించడానికి ప్రయత్నించలేదు. అది దేనినీ పాటించడంలాంటిది కాదు. అది చాలా సహజంగా జరిగింది. మొత్తం విషయంలో అది ఒక భాగమైపోయింది.

**భక్తుడు** : ఆ నియమాన్ని అంటిపెట్టుకోవడానికి మాకు అంత బలం ఎక్కడినుండి వస్తుంది? ఎందుకంటే మా ఇష్టాయిష్టాలతో బలహీనంగా తయారై మా మనస్సు ఎటుపోతే అటు పోతుంటాము.

**గురువుగారు :** అది ఎక్కడి నుండి వస్తుందో నాకు తెలియదు. అయితే అది లక్ష్యాన్ని చేరుకోవాలి అనే మన కోరిక వలన రావచ్చనుకుంటాను. అది మాత్రమే బలాన్నివ్వగలదు.

**భక్తుడు** : కాబట్టి అది వాస్తవంగా మనం ఎక్కడున్నామో చూపిస్తుంది కదా?

**గురువుగారు :** అవును అందుకనే (వాచా) ఎవరైనా చెప్పినపుడు నేను ఎప్పుడూ నమ్మను. వాళ్లు ఏం చేస్తున్నారు అనే దాని నుండి తీసుకుంటాను.

**భక్తుడు** : కానీ మీ విషయంలో నియమాన్ని అంటిపెట్టుకోవడానికి, లక్ష్యాన్ని చేరుకునేదానికి ప్రత్యక్ష సంబంధం వుంది. ఆ నియమాన్ని అంటిపెట్టుకోవడమనేది మీ లక్ష్యంవైపుకు మిమ్మల్ని నడిపించింది.

**గురువుగారు :** అవును. దానినే నియమం అంటారు.

## కోపాన్ని జయించడం ఎలా? – *జూన్ 2012*

**భక్తుడు** : కోపం అంటే ఏమిటి? కోపం ఎట్లా వస్తుంది?

**గురువుగారు :** ప్రతి ఒక్కరూ, ఇతరుల దృష్టిలో తాము ఫలానా అని అనుకుంటూ దానికి అనుగుణంగా తమపై తాము ఒక స్వంత అభిప్రాయాన్ని కలిగివుంటారు. దానినే మనం 'అహం' అంటాము. "మనం అహాన్ని సమూలంగా తుడిచిపెట్టాలి!". "అహం అసలు ఉండనేకూడదు. దానిని నాశనం చేయాలి!". ఇలా అహం అనే పదాన్ని మనం చాలా తేలికగా వాడేస్తూ వుంటాము. అయితే అసలు ఈ అహం అంటే ఏమిటి? మీలో ఎవరైనా ఎప్పుడైనా దాని గురించి ఆలోచించారా? 'నేను' అనేదే 'అహం' అని మీరనవచ్చు. కానీ అది ఒక సమాధానం అవుతుందా? 'నేను' అనేదేనా 'అహం'... అది అంతమాత్రమేనా? అయితే మరి 'అహం' అనే పదానికి బదులు 'నేను' పదాన్ని మీరు ఎందుకు వాడటంలేదు?

సాధారణంగా మన అనుభవంలో 'అహం' అంటే ఏమిటంటే – 'ఇతరుల దృష్టిలో మనమేమిటి అని మనం అనుకుంటామో' అది. ఇది ఖచ్చితమైన నిర్వచనం కాదు కానీ మనం ఈ 'అహం' అంటే ఏమిటో దానిని కాస్తయినా అవగతం చేసుకోవాలని అనుకుంటే ఇది ఉపకరిస్తుంది.



**భక్తుడు :** మన గురించి ఇతరులు ఏమనుకుంటున్నారు, మన గురించి మనమేమనుకుంటున్నాం – వీటిని మీరు రెండు వేర్వేరు విషయాలుగా ఎందుకు చూస్తున్నారు?

**గురువుగారు :** ఎందుకంటే మన గురించి మనం ఏమనుకుంటున్నాం అనేది సాధారణంగా ఇతరులు మన గురించి ఏమనుకుంటున్నారు అనేదానిపై ఆధారపడి వుంటుంది. నిజానికి, ఇతరులు మన గురించి ఏమనకుంటున్నారు అని కాదు. వాళ్లు మన గురించి ఏమనుకుంటున్నారని మనం అనుకుంటుంటామో అది! (గురువుగారు నవ్వుతూ) అందరూ మనల్ని చాలా గొప్పగా అనుకుంటున్నారని మనం అనుకోవచ్చు. వాస్తవానికి ఇతరులు మన గురించి అలా అనుకోకపోవచ్చు. సమస్య ఇక్కడే వస్తుంది. మన గురించి అందరూ గొప్పగా అనుకుంటున్నారు అనేటటువంటి ఈ భావనకు ఏ రకంగానైనా భంగం కలిగినపుడు మనకు కోపం వస్తుంది.

**భక్తుడు :** గురువుగారూ! అప్పుడప్పుడూ ఉన్నట్టుండి చుట్టు ప్రక్కల ఎవ్వరూ లేకపోయినప్పటికీ కూడా కోపం వస్తుంది...

**గురువుగారు :** అది అలా రాదు. నీ గురించి నీకుండే భావనను (ఇమేజ్) గాని, నీ అహాన్ని గాని దెబ్బ తీసేటటువంటి ఏదైనా సంఘటనను నువ్వు గుర్తుకు తెచ్చుకోవడమో లేదా ఊహించుకోవడమో చేస్తుంటావు. మనం భౌతికంగా ఒంటరిగానే ఉన్నప్పటికి అటువంటి జ్ఞాపకంగాని లేదా ఊహగాని మనతోనే వుంటుంది. అది అంతకుముందు జరిగిన దాని పర్యవసానం కావచ్చు. అంటే మనం పరిస్థితుల వల్ల అంతకుముందు అణచుకున్నటువంటి విషయం మనం ఒంటరిగా వున్నపుడు దాని నీడలాగా, ఓ జ్ఞాపకంలాగా, స్మృతిలాగా గుర్తుకు వస్తుంది – రెండోది – ఏదైనా విషయాన్ని పూర్తిగా అర్థం చేసుకోలేకపోవడంచేత, అవగాహనాలోపం వలన కోపం వస్తుంది. మూడోది – మనకు బాధ కలగడం వల్ల గాని, ఏదైనా సుఖాన్ని కోల్పోవడం వల్లగాని మనకు కోపం రావచ్చు. మొత్తంమీద చెప్పాలంటే, కోపం రావడానికి ఈ మూడు కారణాలు కారణమవుతాయి. నీకు కోపం వచ్చిన ఏ సందర్భాన్ని తీసుకున్నా దానికి కారణం ఈ మూడింటిలో ఏదో ఒకటి అయి వుంటుంది.

మొట్టమొదటిది – మన గురించి మనకుండే భావనను (ఇమేజ్) దెబ్బతీసే విషయాన్ని గుర్తు చేసుకోవడం, ఊహించుకోవడం. ఇది చాలా వరకు ఊహామాత్రమే అయివుంటుంది. దానికి ఎటువంటి ఖచ్చితమైన ఆధారం వుండదు. కాబట్టి ఇది ఊహాజనితమని తెలుసుకుని స్పష్టంగా, ఉన్నదున్నట్లుగా ఆలోచించడం మొదలుపెడితే దీని ప్రభావాన్ని కొంతమేరకు తగ్గించుకోవచ్చు. రెండవది – అవగాహన లేకపోవడం. విషయాన్ని పూర్తిగా తెలుసుకోవడం ద్వారా దీనిని పరిష్కరించుకోవచ్చు. మూడవది – సుఖాన్ని కోల్పోవడం లేదా బాధ కలగడం. ప్రేమ అనే మంచి భావోద్వేగం కలిగి వుండటం ద్వారా దీనిని నివారించవచ్చు. మొదటి కారణంలా కాకుండా ఇది వాస్తవం! ఎవరైనా నిన్ను కొట్టారంటే అది ఊహనో, కల్పనో కాదు. రెండవ కారణానికి సంబంధించినంతవరకు – ఇది మొదటిదానితో ముడిపడి వుంటుంది. సాధారణంగా నేను బస్సు ప్రయాణాన్నో లేక రైలు ప్రయాణాన్నో ఉదాహరణగా చెప్తుంటాను. నువ్వు నీ సీటులో కూర్చుని ప్రయాణం చేస్తుంటావు. ఇంతలో ఎవరో వచ్చి నీ పాదాన్ని తొక్కారనుకోండి. నీకు బాధ కలుగుతుంది. "ఏయ్ కళ్లు కనిపించడం లేదా, చూసి నడవలేవా, అంత హడావుడి ఏమిటి?" అని నువ్వు కోపంగా గయ్యిమంటూ అరుస్తావు. ఇంతలో ప్రక్కనే వున్నతను "క్షమించదమ్మా! ఆయన గ్రుడ్డివాడు, చూడలేడు"! అని చెప్పగానే అప్పటికప్పుడు నీ కోపమంతా కరిగిపోయి, "అయ్యయ్యో! నన్ను క్షమించండి, దయచేసి నన్ను మన్నించండి, ఇందాక నాకు తెలియక అరిచాను, రండి వచ్చి ఇలా

కూర్చోండి" అని నీ సీటును అతనికి ఇస్తావు. (గురువుగారు నవ్వుతూ)



ఒక్కసారి దీని గురించి ఆలోచించండి. అక్కడ మీ కోపమంతా ఏమయింది. దాని వెనుక గల తత్వమేమిటి? నిజానికి అక్కడ మిమ్మల్ని బాధపెట్టింది శారీరకమైన నొప్పి కాదు. ఒకవేళ అదే గనుక కారణమైనట్టయితే నీకు ఇంకా ఆ కోపం వుండాలి. ఎందుకంటే నీకింకా ఆ నొప్పి వుంది. నీ పాదం ఇంకా బాధిస్తుంది. కాబట్టి నీకు కోపం రావడానికి కారణం ఆ నొప్పి కాదు. ఇతర వ్యక్తులు నీతో ఫలానా విధంగా ప్రవర్తించాలని నువ్వు ఆశిస్తున్నావు. ఆ మర్యాద లేకపోవడం నిన్ను బాధపెట్టింది. అతని ఉద్దేశ్యం అది కాదని, అతను అలా చేయడానికి గల కారణం అతనికి చూపులేకపోవడమేనని నీకు తెలిసిన తరువాత అప్పటికప్పుడు మొత్తం విషయం మారిపోతుంది. నువ్వు నిలబడైనా సరే నీ సీటును అతనికి ఇవ్వబోతావు. నీ కోపానికి ఏమైంది? ఆ కోపం ప్రేమగా, దయగా ఎలా మారుతుంది? దీన్ని ఇదే విధంగా వివిధ సందర్భాలకు అన్వయించి చూడండి. నాకు కోపం ఎందుకు వస్తుంది? "ఓహో, నేను అతని నుండి దీన్ని ఆశిస్తున్నాను, అందుకే నాకు కోపం వస్తుంది" (అని తెలుస్తుంది).

నువ్వు మీ పాపతో ఆడుకునేటపుడు తను నీ గుండెలపై నిలబడి గెంతడం మొదలుపెట్టిందనుకోండి. అది నొప్పిగానే వుంటుంది. అందులో సందేహం లేదు. కానీ నువ్వు "ఇంకాస్త ఎగురు, ఇంకాస్త ఎగురు!" (గురువుగారు నవ్వుతూ...) అంటావు. కోపం రావడానికి నొప్పేగనుక కారణమైతే నీకు మీ పాప పట్ల కూడా కోపం రావాలి. కానీ అప్పుడు నీకు కోపం ఎందుకు రావడం లేదు?

**భక్తుడు :** ఎందుకంటే అక్కడ ప్రేమ వుంది.

**గురువుగారు :** ప్రేమ వుంది కాబట్టి. నేను మీ కోపానికి గల కారణాలు చెప్తూ కోపాన్ని ప్రేమతో అదుపు చెయ్యవచ్చు అని చెప్పినపుడు అది మీకు అస్పష్టంగా ఉంది, అందుకనే మీకు కొన్ని ఉదాహరణలు ఇచ్చాను. "కోపాన్ని ప్రేమ ఎలా అదుపులో ఉంచుతుంది"? ఎలాగంటే మనం ముందు చెప్పుకున్నట్లుగానే.

**గురువుగారు :** మనం సాధారణంగా ఫలానా సంఘటన జరగడం వల్ల లేక ఈయన ఇలా చేయడం వల్ల, ఆమె ఆలా చేయడం వల్ల మనం కోపం వచ్చిందని అనుకుంటాం. కానీ అది అర్ధరహితం. దానికి కారణం అది కాదు. దాని వెనుక మరేదో వుంది. దానిని గనుక నువ్వు తెలుసుకోవాలని ప్రయత్నిస్తే కోపాన్ని పూర్తిగా జయించలేకపోయినా కనీసం నువ్వు కోపగించుకునే సందర్భాలను తగ్గించుకోవచ్చు. ఇతరులు మన గురించి ఫలానా విధంగా అనుకుంటున్నారని మన గురించి మనకున్న భావన తప్పు అని మన కోపం తెలియచేస్తుంది. ఇతరులు నిన్ను గౌరవించాలని, ప్రేమించాలని నీతో తగు విధంగా ప్రవర్తించాలని నువ్వనుకుంటావు. కానీ అలా జరగడం లేదు. అలా జరగడం లేదంటే మన అవగాహన నిజం కాదు. మన గురించి మనకున్న భావన తప్పు.

**గురువుగారు :** మనం ఇతరుల నుండి ప్రేమను, గౌరవాన్ని ఎందుకు ఆశించాలి (అవి పొందలేనపుడు) వారి మీద ఎందుకు కోపగించుకోవాలి? ప్రేమాభిమానాలు, ఆదరం వంటి వాటి కోసం ఇతరులను యాచించడం దేనికి? వాళ్లు మన పట్ల ప్రేమాభిమానాలు, గౌరవం చూపించకపోతే మనకు కోపం వస్తుంది. ఇతరులు మన అభీష్టాన్ని అనుసరించి పోవాలని ప్రాకులాడుతుంటాం. వాళ్లు మనను లక్ష్యపెట్టాలని దేబిరిస్తుంటాం. కోపం రావడానికి వెనుకగల ఆంతర్యాన్ని మనం అర్థం చేసుకోగలిగితే కోపం రావడం ఆగిపోతుంది. అది మళ్లీ వస్తే రావచ్చు గాక, మరలా దానిని అర్థం చేసుకుంటూ ఉంటే అది క్రమంగా మాయమవుతుంది.



**గురువుగారు :** నేను చెప్పినట్టు, మీకు స్పష్టత లేకపోవడం, పూర్తి అవగాహన వుండకపోవడం మీ కోపానికి గల రెండవకారణం. ఇక మూడవకారణం విషయానికి వస్తే "ప్రేమ, ప్రేమ, ప్రేమ! నాకు ప్రేమ కావాలి" అని మీరు ఎప్పుడూ మాట్లాడుతుంటారే ఆ సహజమైన ప్రేమ మీలో లేకపోవడం.

**భక్తుడు :** కానీ గురువుగారూ, కోపం వచ్చీ రాగానే శరీరంలో బలమైన ప్రతిస్పందనలు కలుగుతున్నాయి. నాలో ప్రేమలేదు అని నాకు నేను తెలియచెప్పుకునేటప్పటికే ఆలస్యమైపోతుంది కదా! దాని గురించి ఏమిటి చెయ్యడం?

**గురువుగారు :** బలమైనటువంటి ఏ భావోద్వేగమైన శారీరకపరమైన ప్రతిస్పందనలు కలుగచేస్తుంది. అంతవరకే! కానీ ఆ శారీరక ప్రతిస్పందన ముఖ్యం కాదు. కేవలం కన్నీళ్లు కార్చడం ఏడవడం కాదు. నీ హృదయంలో నువ్వు అనుభవించే ఆ వేదన, ఆ వ్యధ... అదే నిజమైన బాధ. ఉల్లిపాయలు తరిగేటపుడు కూడా కన్నీళ్లు వస్తాయి (నవ్వులు). అందుకని భౌతికమైన ప్రతిస్పందనలను పట్టించుకోవద్దు. ఒక్కొక్కరూ ఒక్కోరకంగా ప్రతిస్పందిస్తుంటారు. కొంతమందికి భావోద్వేగాల తీవ్రతకు శరీరం ఎక్కువగా ప్రతిస్పందిస్తుంది. కానీ నేను దానికి మూలమైన భావోద్వేగం గురించి మాట్లాడుతున్నాను.

**భక్తుడు :** ఇక మీదట అలా జరిగినపుడు (కోపం వచ్చినపుడు) ఏం చేయాలి లేదా దానిని ఎలా పట్టుకోవాలి అనేదానికి నాకో పద్ధతి కావాలి. ఎలాగైనా కోపాన్ని (రావడానికి) ముందే పట్టుకోవడం సాధ్యమేనా?

**గురువుగారు :** నువ్వు ఒక్క విషయాన్ని అర్థం చేసుకోగలిగితే కోపాన్ని జయించవచ్చు. ఉదాహరణకు, నీ దగ్గరకు ఎవరో వచ్చి వాళ్ల కష్టాల గురించి, వారి ఇబ్బందుల గురించి చెప్పడం మొదలుపెట్టారనుకుందాం. నువ్వు కాసేపటికి విసిగిపోయి, కోపగించుకోవడం మొదలుపెడతావు. అదే సందర్భంలో ఆ వ్యక్తి స్థానంలో నువ్వుండి ఆలోచించు. నీకే గనుక అటువంటి సమస్యలే వుంటే, నువ్వు కాస్త ఓదార్పు కోరుకుంటావు. బహుశా నువ్వు నా దగ్గరకు వచ్చి చెప్పుకుంటావు. నేను ప్రేమతో, ఆదరంతో స్పందించాలని, అర్థం చేసుకోవాలని ఆశిస్తావు. లేదంటే నువ్వు బాబా వద్దకు వెళ్లి "బాబా, నేను ఇలా వున్నాను, నావల్ల ఏమీ కావడంలేదు, నన్ను అనుగ్రహించండి" అని ప్రార్థిస్తావు. ఇతరులు మనల్ని మనంగా అంగీకరించాలని మనం ప్రయత్నిస్తున్నపుడు, ప్రక్కన వాళ్లను వారిగా మనం ఎందుకు అంగీకరించలేకపోతున్నాం? మనమేమో ప్రక్కన వాళ్లను వాళ్లుగా అంగీకరించం కానీ మరొకరు మనల్ని మనంగా అంగీకరించాలి. నీ దగ్గరకు వచ్చిన వ్యక్తి కేవలం వాళ్ల సమస్యలు చెప్పాలనుకుంటున్నారు. మనం ఏం చెయ్యలేకపోయినా కనీసం అలా వినడం వలన మనం కోల్పోయేదేమన్నా వుందా? మీరే ఏమైనా చేయగలిగితే మంచిది, చెయ్యండి.

**భక్తుడు :** మాకు ఈ కోపం, ఈ వేదన, ఈ వ్యధ అనుభూతం కానటువంటి ఆ స్థితికి మేము చేరుకోవడమెలా?

**గురువుగారు :** మీ హృదయంలో సద్గురువు రగిలించిన ప్రేమ వుంటేనే అది సాధ్యమవుతుంది. మీ హృదయంలో ప్రేమ వున్నాక, మీరు చెడును చూడలేరు! వారిలో మీకు తెలియనితనం కనిపిస్తుంది. మీరు వారి కోపాన్ని అర్థం చేసుకుని వారి పట్ల సానుభూతి చూపుతారు. ఏసుక్రీస్తు ఏం చెప్పారు? ఆయనకు శిలువ వేయబడుతూ చీలలు కొట్టి శూలారోపణ చేస్తున్న సమయంలో కూడా ఆయన ఏమన్నారు? "తండ్రీ వారు చేస్తున్నదేమిటో వారికి తెలియదు, వారిని క్షమించండి". ఆయనకు గల వివేకం వలన, ఆ ప్రేమ వలన అంతటి సహనం సాధ్యమయింది. బాబా కూడా అలాగే ప్రతిస్పందించారు. ఆయన ఇలా అన్నారు "పసిబిడ్డ కాలిపై మలవిసర్జన చేస్తే

బిడ్డనునరుకుతామా, కాలిని నరుకుతామా?" లేదు, ఎందుకంటే ఆ పసిబిడ్డకు తను ఏం చేస్తుందో తెలియదు. అందుకనే మహాత్ములు దానిని ద్వేషంగా భావించరు. మన పిల్లలు ఏమైనా చేస్తే మనం దానిని ఎలా చూస్తాం? అటువంటి దృక్పథం రావడానికి మన హృదయం ప్రేమతో నిండిపోవాలి. మన హృదయంలో ప్రేమ పెల్లుబికి అది ప్రేమతో నిండిపోవాలి. అలా అయినపుడే అది సాధ్యమవుతుంది. అటువంటి ప్రేమ వున్నపుడు మిగతావన్నీ దానిని అనుసరిస్తాయి. ఏసుక్రీస్తు వారు చేస్తున్నదానిలో చెడును చూడనేలేదు.



**భక్తుడు :** మేము అటువంటి ప్రేమను అనుభవించేలోపల, ఇప్పటికే మాలో వున్న కోపాన్ని ఎలా ఎదుర్కోవాలి?

**గురువుగారు :** ప్రక్కన వ్యక్తిని అర్థం చేసుకోవడం ద్వారా, ఆదరించడం ద్వారా, సానుభూతి చూపించడం ద్వారా, వారి పరిస్థితిని అవగాహన చేసుకోవడం ద్వారా..! ఇవి వున్నపుడు కోపం వుండదు.

## భవసాగర తారణ కారణహే

1995–96 ప్రాంతంలో గురువుగారు తిరుమల వచ్చారని తెలిసి గురుదేవుల దర్శనం కోసం తిరుమల వెళ్లాను. దర్శనానికి వెళ్లి గురువుగారిని చూడగానే నా మనసులో వున్న బాధని, నా సమస్యలని, మా కుమార్తెల వివాహం గురించి చెప్పి, ఏడ్చి, సమస్యలు భరించలేక ఆత్మహత్య చేసుకోవాలనుకుంటున్న నా ఆలోచన గురించి గురువుగారికి చెప్పాను. నేను చెప్పిన మాటలు వినగానే గురువుగారు తీవ్ర స్వరంతో "ఎప్పుడో పిల్లల పెళ్లిళ్ల గురించి ఇప్పుడే ఎందుకు బాధపడతావు, బాబా చూసుకుంటారులే పో" అన్నారు. పాద నమస్కారం చేసుకున్నాక, ఊదీ పెడుతూ "నువ్వు తెనాలి వెళ్లాక నీకు మంచి పని దొరుకుతుంది" అని ఆశీర్వదించి పంపారు. నేను తెనాలికి బయలుదేరి వచ్చాను. మాది ఇత్తడి, రాగి, స్టీలు, ఇతరత్రా వస్తువులకు మెరుగుపెట్టే వ్యాపారం. గురువుగారు చెప్పినట్లు ఏ మంచి పని వస్తుందా అని ఎదురు చూస్తుండగా 2 రోజుల తరువాత గురుబంధువు కిరణ్ రాత్రి సమయంలో 4 జతల రాగితో చేసిన పావుకోళ్లు తీసుకొని అత్యవసరంగా వాటికి బఫింగ్ చేసి ఇమ్మని అడగడంతో పనివాడు లేకపోయినా నేనే బఫింగ్ చేసి ఇచ్చాను. ఆ పావుకోళ్ళు తీసుకెళ్లి కొద్ది సమయంలోనే మరలా 150 జతల పావుకోళ్ళు తీసుకొచ్చి అదేరోజు రాత్రికి వాటికి మెరుగు పెట్టి ఇవ్వవలసింది అని చెప్పడంతో నేను ఆ పనిలో నిమగ్నమైపోయాను. ఆ పావుకోళ్ళు గురించి కిరణ్‌ను అడుగగా అవి పుట్టపర్తి సత్యసాయిబాబాగారి భక్తులు బాబాగారి చేతుల మీదుగా ఆ పాదుకలు తీసుకొని పూజలో పెట్టుకునే నిమిత్తం చేయించుకున్నవి అని చెప్పాడు. ఆ రాత్రంతా ఆ పావుకోళ్ళుకి బఫింగ్ చేస్తుండగా ఎందుకో నా మనసులో ఒక ఆలోచన కలిగింది. నేను కూడా ఒక జత పాదుకలు చేయించి గురువుగారి పాదాలకు తాకించి పూజలో పెట్టుకోవాలని. వెంటనే నేను కూడా తెలిసిన వారి ద్వారా ఇత్తడి రేకుమీద పాదుకల నమూనా గీయించి ఒక జత పాదుకలను చక్కగా తయారు చేయించుకొని శిరిడీకి తీసుకెళ్లాను. అప్పుడు ఓల్డ్ సాయిపథం గురువుగారి నివాసం. గురువుగారి దర్శనార్థం క్యూలో వున్నానే కాని, గురువుగారు, నా కోరికను మన్నిస్తారా నేను అనుకున్నట్లుగా గురువుగారు నేను తీసుకొచ్చిన పాదుకలు ధరిస్తారా లేదా? కానీ గురువుగారు కూర్చుని వుంటారు కదా దర్శనసమయంలో. ఇది ఎలా జరుగుతుంది? అని రకరకాల ఆలోచనలు. సందేహాలతో లోపలికి వెళ్లాను. గురువుగారి గది గుమ్మం దగ్గరకు వెళ్ళాక, నా ముందు వారు గురువుగారికి నమస్కారం చేసుకుంటున్నారు. ఆ సమయంలో గురువుగారు నావైపు చూడగా నేను కవర్లలో వున్న పాదుకలను తీసి గురువుగారికి చూపించాను. నావంతు దర్శనం



రాగానే నేను గురువుగారికి నమస్కరించి పాదుకలను గురువుగారి ముందుంచాను. అవి చూసి గురువుగారు "ఏంటి ఇవి?' అనడిగారు. "మీ పాదుకలండి, పూజలో పెట్టి పూజించుకుందామనుకుంటున్నాను." అని చెప్పాను. దానికి గురువుగారు "నావెందుకు బాబావి తీసుకెళ్ళు" అన్నారు. "మీరే నాకు బాబా, మీరే నాకు గురువు, అన్నీ మీరే" అని చెప్పాను. వెంటనే గురువుగారు కూర్చునే వారి పాదాలు ఆ పాదుకల మీద ఉంచారు. నా ఆనందానికి అవధులు లేవు. వెంటనే గురువుగారి పాదాల మీద పడి, కన్నీళ్లతో "మీ పాదధూళిగా పడి వుండు భాగ్యము కలిగింపుమో దేవసాయి, నిను చూసి పులకించి మైమరచి తరియింపు, కరుణింపుమో దేవసాయి... " అని ఏడుస్తూనే గురువుగారి దగ్గర పాడాను. 2,3 నిమిషాల తరువాత నాకు మీదగ్గర నుండి వెళ్లాలని లేదు, ఇంకొంతసేపు వుండాలని వుంది అని గురువుగారితో చెప్పాను. దానికి గురువుగారు అనుమతినిస్తూ ప్రక్కనే కూర్చోమన్నారు. నా చేతికి అరటి గెలలు ఇచ్చి ఒక్కొక్కటి వలిచి దర్శనం కోసం వచ్చిన వారికి ఇవ్వడానికి ప్రక్కన పెట్టమన్నారు. నా మనసులో వేరే ఆలోచనలు రానంతసేపు గురుదేవుల ప్రక్కనే కూర్చున్నాను. నా మనస్థితి మారేకొద్దీ నాలో వేరే ఆలోచనలు రాగానే కొంచెం ప్రక్కగా కూర్చోమని చెప్పారు. మరలా కొంతసేపు కొంచెం దూరంగా కూర్చున్నాను. దర్శనాలు అయిపోయిన తరువాత గురువుగారితో నాకు ఇంకా శిరిడీలో వుండాలని వుంది అని అడిగాను. దానికి గురువుగారు సమాధానమిస్తూ నేను అటువైపు వస్తానుగా, వచ్చినపుడు వుందువుగానిలే, ఇపుడు అందరితో కలిసి వచ్చావుగా కలిసే వెళ్లు, అని చెప్పి, ఊదీ ఇచ్చి పంపారు. అలా గురువుగారి పాదుకలను ఆనందంతో ఇంటికి తెచ్చుకున్నాను. ఆ పాదుకలను తెనాలి, పరిసర ప్రాంతాల సత్సంగాలకు తీసుకెళ్లి గురువుగారి అనుగ్రహాన్ని గురుబంధువులందరితో పంచుకున్నాను.

తరువాత కొద్దికాలం గడిచిపోయింది. ఒకసారి గురువుగారు తిరుమలకు వచ్చారని తెలిసి దర్శనం కోసం తిరుమల వెళ్లాను. గురువుగారి దర్శనానికి వెళ్లి నమస్కరించగానే గురువుగారు పలకరిస్తూ "వారం పది రోజులు ఇక్కడ వుండటానికి నీకేమైనా ఇబ్బందా" అని అడిగారు. ఆనందంగా వుంటాను గురువుగారు అని చెప్పాను. నన్ను ఇక్కడ ఏం చేయమంటారు అని అడగగా "రోజూ ఉదయం టిఫిన్ చేసి, ఇంకొంత మూట కట్టుకుని జాపాలీ తీర్థం వెళ్లి, సాయంత్రం వరకు వుండిరా" అని చెప్పారు. అలాగే 4,5 రోజులు చేసాను. జాపాలీ తీర్థం యొక్క విశిష్టత ఏమిటంటే ధృవుడు, శ్రీమన్నారాయణుని కోసం తపస్సు ఆచరించిన స్థలమని, జాపాలుడు ఆంజనేయస్వామిని దర్శించుకున్న స్థలమని ఆ ప్రదేశం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఆ ప్రదేశంలో గడిపిన ఆ 4,5 రోజులు గురువుగారు ఎన్నో మధురానుభూతులను ప్రసాదించారు. తరువాత గురువుగారు ఊదీ ఇచ్చి పంపించారు. నేను తెనాలికి వచ్చిన చాలా రోజులకు నాకు జాపాలీ తీర్థంలో గడిపిన మధుర క్షణాలను తలచుకుంటుండగా నాకు మీతో గడపాలని వుంది అని శిరిడీలో అడిగినపుడు "నేను అటువైపు వస్తానుగా అపుడు వుందువుగానిలే" అని గురువుగారు అన్న మాటలు గుర్తుకు వచ్చాయి. అడిగిన నేను మరచిపోయినా, ఆయన మరువక నన్ను అక్కడ వుంచుకొని వారి సాన్నిధ్యాన్ని అనుభవించే అవకాశాన్ని ప్రసాదించారు. అందుకే గురుసన్నిధే పెన్నిధి అంటుంది శాస్త్రం. అలానే నా కుమార్తెల వివాహాలు కూడా వారి దయతో, అనుగ్రహంతో జరిగాయి. ఆ అనుగ్రహ లీలలు వచ్చే సంచికలలో మీ అందరితో పంచుకుంటాను. ఆ భాగ్యాన్ని కలిగించిన గురుదేవులకు సహస్రనామ నమస్సుమాంజలితో .....

**– మీ ఈశ్వరరావు, తెనాలి**

# గురుమతము



వేదంలో మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్య దేవోభవ, అతిథి దేవోభవ అని చెప్పబడింది. అక్కడ మాతృదేవాది శబ్దములు బహువ్రీహి సమాసములు. నీవు మాతృదేవుడవు కమ్ము, అనగా తల్లిని దేవునిగా చూచువాడవు కావలసినది. మిగిలిన శబ్ధాలు కూడా ఇదే పద్ధతిలో అన్వయించాలి. తల్లిదండ్రులు నిజమైన దేవతలు కావచ్చు, కాకపోవచ్చు కానీ వారిని దేవుళ్లుగా భావించి ఆరాధించిన కుమారుడు తరిస్తాడు. ఏ వ్యక్తిలోనైనా దేవుని చూడగల్గిన తీవ్రభావన వుంటే ఆ భావము వల్ల, ఆ విశ్వాసము వల్ల ఆ వ్యక్తి దివ్యానుగ్రహాన్ని పొందుతాడు. ప్రాచీన గాథలలో పతివ్రతల కథలన్నీ అటువంటివే. భర్త దుష్టుడైనా, దుర్నీతి పరుడైనా, రోగి అయినా అతనిని దేవునిగా భావించి, సేవించిన పతివ్రతలు సూర్యుడినే శాసించగలిగారు. దిక్పాలకులనే నియంత్రించగలిగారు. భావతీవ్రత, నిష్ఠ ఎక్కడైతే వుంటుందో, అక్కడల్లా శక్తి ఉదయిస్తుంది. ఈ సాధకులందరికీ తమ తల్లులు, తండ్రులు, భర్తలు, అతిధులు గురువులు, దేవతలు కారని తెలుసు. కానీ వారి యందు ఏర్పడిన భక్తి వల్ల, శ్రద్ధ వల్ల దేవత్వభావన చేస్తుంటారు. గురుశిష్య సంప్రదాయంలో ఈ భావనే పరాకాష్ఠ నందుకుంటుంది. సుప్రసిద్ధమైన గురుస్తోత్ర శ్లోకాన్ని గమనించండి.

గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః
గురుస్సాక్షాత్ పరంబ్రహ్మా తస్మై శ్రీ గురవే నమః

గురువే బ్రహ్మా, గురువే విష్ణువు, గురువే మహేశ్వరుడు, గురువే సాక్షాత్ పరంబ్రహ్మా, అటువంటి గురువునకు నమస్కరిస్తున్నాను అని ఈ శ్లోక భావన.

అజ్ఞాన తిమిరాంధస్య జ్ఞానాంజన శలాకయా
చక్షురున్మీలితం యేన తస్మై శ్రీ గురవే నమః

అజ్ఞానమనే చీకటి చేత గ్రుడ్డియైన వారికి జ్ఞానమనే అంజనాన్ని పూసి, కన్నులు తెరిపించిన గురువునకు నమస్కారము అని దీని భావము. గురువు అజ్ఞానాన్ని తొలగిస్తాడని, వెలుగును ప్రసాదిస్తాడని ఆ శబ్ధానికే అర్ధం చెప్పబడింది. "గు" అంటే చీకటి "రు" అంటే దానిని అడ్డగించువాడు. ఈ విధంగా గురుస్థానానికి అత్యంతమైన ఔన్నత్యం భావించబడింది. ఏ రంగంలోనైనా ఆ రంగంలో ప్రవీణుడైన వ్యక్తి యొక్క సహాయం లేకుండా ఏ వ్యక్తీ ముందుకు పోలేడు. హలం పట్టుకున్నా, కలం పట్టుకున్నా, నేర్చినవాడు నేర్చినపుడే అందులోని మెళకువలు తెలుస్తాయి. లౌకిక అలౌకిక మార్గాలలో దేనిలోనైనా గురువు అవసరమే. ఆధ్యాత్మిక రంగంలో కొంతమంది దేవునకు, భక్తునకు మధ్య మధ్యవర్తులు దేనికి? సరాసరి దేవతారాధనే శ్రేష్ఠము అని వాదించే వారున్నారు. అది ఎక్కడో ఒకరిద్దరు కారణజన్ముల విషయంలో సరిపోవచ్చునేమో గాని మామూలుగా అందరికీ హృదయంలో జ్ఞానదీపం వెలిగించే ఆచార్యుడు లేకపోతే సరియైన త్రోవ దొరకదు. అయితే వారిని సాధకులు కనుక్కోవడం కష్టము. సాధకులలోని తపనను గుర్తించి, గురువే



శిష్యుల దగ్గరకు రావడం, అదేవిధంగా భాగవత కథలలో చాలా చోట్ల నారదుడు వచ్చి ధ్రువుడు మొదలగు వారికి ఉపదేశించడం గమనించవచ్చు. యోగ్యతను, అవసరాన్ని గుర్తించి మహాత్ములు దిగివస్తుంటారు. సుప్రసిద్ధుడైన యోగిరాజు శ్యామాచరణ లాహిరి విషయంలో జరిగిన సంఘటన ఈనాడు విశ్వ విశ్రుతమైనది. అతడు రైల్వే శాఖలో చిన్న ఉద్యోగి. ఒకరోజు వున్నట్లుండి హిమాలయ పర్వత ప్రాంతాలలో ఒక చిన్న ప్రదేశానికి బదిలీ ఉత్తర్వు వచ్చింది. తీరా అక్కడకు వెళ్లిన తరువాత అక్కడ రైల్వే శాఖ అధికారులు – “ఇక్కడ పని ఏమీ లేదు, మిమ్మల్ని ఎందుకు పంపించారో తెలియదు” అన్నారు. ఆ రోజు సాయంకాలం కొండమీదకి వాహ్యాళికి వెళ్లిన లాహిరి మహాశయునకు ఒక యోగి కనిపించాడు. కొంచెం దూరంలో వున్న ఒక గుహ దగ్గరకు తీసుకొని వెళ్లి అక్కడ వున్న దండకమండలాలను,  జప మాలికలను చూపించి – “నాయనా! ఇవి ఏమైనా నీకు తెలుస్తున్నవా? వీటిని గుర్తు పట్టగలవా?” అని అడిగాడు. లాహిరి గుర్తు పట్టలేకపోయినాడు. నాకేమీ తెలియటం లేదు అన్నాడు. అప్పుడు ఆ యోగి, నీవు పూర్వ జన్మలో ఇక్కడ తపస్సు చేసావు. ఈ వస్తువులన్నీ నీవు ఉపయోగించినవే అని చెప్పి అతనికి కావలసిన ఉపదేశం చేసి జ్ఞాననేత్రం వికసించేలా చేసాడు. ఆయనే మహా అవతార్ బాబా అని వేల సంవత్సరాలు జీవించిన మహాయోగి అని పరమహంస యోగానంద “ఒక యోగి ఆత్మకథ”లో వివరించారు. గురువు శిష్యులను ఆ రకంగా ఉద్ధరిస్తుంటారు.

దక్షిణదేశంలో వైష్ణవ ధర్మ ప్రవర్తకుడైన రామానుజాచార్యులవారు ఒకరోజు శిష్యులతో శ్రీరంగం పురవీధులలో వెళ్తున్నారు. ఆయన కంటికొక విచిత్రమైన దృశ్యం కనిపించింది. “ధనుర్దాసు” అనే యువకుడు తన భార్యకు గొడుగుపట్టి ఆమెకు ఎంత మాత్రం ఎండ సోకకుండా ఒక సేవకునివలె ప్రక్కన నడుస్తున్నాడు. దానిని చూసిన ఆచార్యులవారు శిష్యుల చేత అతనిని పిలిపించి – “ఏమయ్యా! నడివీధిలో ఇలా ప్రవర్తిస్తున్నావు? ఎందుకిలా చేస్తున్నావు” అని అడిగారు. అతడు – “స్వామి! నా భార్య కన్నులు చాలా అందంగా వుంటాయి. ఎండ వేడి సోకితే వాటి అందం తగ్గిపోతుంది. దానిని నేను భరించలేను. సౌందర్య నిధానములైన ఆ లోచనాలు వేడికి వాడటం నేను భరించలేను. ఎవరేమనుకున్న నాకేమీ లెక్కలేదు. అందుకే ఆమెకు గొడుగుపట్టి ఆమె వెంట నడుస్తున్నాను” అన్నాడు. ఆచార్య స్వామి – “నీ భార్య కన్నుల కంటే అందమైన కన్నులను చూపిస్తాను. వాటికి కూడా ఇలానే సేవ చేస్తావా?” అని ప్రశ్నించారు. అతడు “నా భార్య కన్నుల కంటే అందమైన కన్నులు ప్రపంచంలో లేవు. మీరు గనుక అన్న ప్రకారం చూపిస్తే దాసానుదాసుడనై సేవిస్తాను” అన్నాడు. రామానుజులవారు అతనిని వెంటబెట్టుకొని గుడికి వెళ్లి – “అవిగో అటుచూడు స్వామి దివ్య నేత్రాలను వీక్షించు” అన్నారు. ఆ మహనీయుని ప్రభావం వల్ల ధనుర్దాసుకు శ్రీ రంగనాథుని దివ్యనేత్రాల దర్శనం కలిగింది. దానితో అతని జీవితమే మారిపోయింది. అతని మీద అంత అవ్యాజ్యమైన అనుగ్రహాన్ని ఆచార్యులవారు ఎందుకు చూపించారో? వాని పూర్వజన్మ సంస్కారమేమిటో, ఆ సద్గురువులకే తెలియాలి. గురువులనుగ్రహిస్తే శిష్యులు చదవకుండానే చదువు వస్తుంది. తపస్సు చేయకుండానే దేవతానుగ్రహం వస్తుంది. జగద్గురు శంకరాచార్యుల  శిష్యులలో ఒకనికి ఎంత చెప్పినా



సరిగా విద్య వచ్చేది కాదట. కానీ వాని గురుభక్తి అచంచలము. గురువుగారికి కావలసిన పనులన్నీ వాడు శ్రద్ధతో చేసేవాడు. మిగతా శిష్యులు వానికి చదువురాదని అవహేళన చేసేవారు. వారికి తగిన పాఠం చెప్పాలని ఒకనాడు భాష్య ప్రవచనం మొదలుపెట్టిన శంకరుల వారు దూరాన వున్న ఆ చదువురాని శిష్యుని రమ్మని పిలిచారు. జగద్గురువుల సంకల్పం వల్ల వాని కప్పటికప్పుడు విద్యా ప్రాప్తి కలిగి కవియై తోటక వృత్తాలలో గురువుగారిని స్తుతిస్తూ వచ్చాడు. మిగిలిన శిష్యులకు దిగ్భ్రాంతి కల్గింది. అతడే తరువాతి కాలంలో తోటకాచార్యులన్న పేరుతో ప్రసిద్ధిచెందాడు.

జగత్ ప్రసిద్ధుడైన వివేకానంద స్వామి రామకృష్ణ పరమహంస వలన ఎంపిక చేయబడి తీర్చి దిద్దబడినవాడే. భగవదన్వేషణలో ఆ యువకుడైన నరేంద్రునికున్న ఆసక్తిని గమనించిన పరమహంస అతనిలో జ్ఞాన జ్యోతిని వెలిగించి మహాపురుషుడయ్యేలా తన తపఃశక్తిని ధారపోశాడు. మహితాత్ములైన గురువులు శిష్యులను అనుగ్రహించిన ఇటువంటి కథలెన్నో మన వాఙ్మయంలో గోచరిస్తవి.

శాస్త్ర విజ్ఞాన వేత్తలైన గురువులు తమ ప్రభోధంతో తమ పాండిత్య ప్రాభవంతో శిష్యుల సందేహాలు తీరుస్తారు. దివ్యశక్తి సంపన్నులైన గురువులు శిష్యులకు మహిమాత్మకమైన అనుభూతులను ప్రసాదించి వారి సంశయాలను తొలగిస్తారు. కొందరు కేవలం తమ చూపు చేతనే శిష్యుల సందేహాలను తీరుస్తారు. ***వటవృక్ష మూలము నందు ఆసీనుడైన దక్షిణామూర్తి మౌనంతోనే శిష్యుల సందేహాలు పోగొట్టేవాడట.***

వృద్ధులైన మహర్షులు యువకుడైన దక్షిణామూర్తి ముందు కూర్చుంటే వారి మనసులో కలిగిన సందేహాలు వాటంతటవే తొలగిపోయేవట. ఇటువంటి సంఘటన ఒకటి రమణమహర్షి జీవితంలో చూడవచ్చు. ఉత్తమ హిందుస్థానం నుండి ఒకగొప్ప పీఠాధిపతి అరుణాచలం వచ్చాడు. పెద్దవాడు వచ్చాడు కదాయని మహర్షి కూర్చునే ఉన్నతాసనం ఎదురుగా ఆయనకో సింహాసనం వేశారు. ఆయన వచ్చి కూర్చున్నారు. భక్తులంతా వారిద్దరూ ఏం మాట్లాడుకుంటారో విందామని ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. దాదాపు గంట గడిచినా ఎవరూ ఏమీ మాట్లాడలేదు. అప్పుడా పీఠాధిపతులు రమణుల వైపు చూచి – "భగవాన్! నాకు అవగతమైంది. నా మనస్సులోని సందేహాలు తీరినవి" అన్నాడు. ఈయన అడిగింది లేదు ఆయన చెప్పింది లేదు. పీఠాధిపతి మనస్సులోని సందేహాలు మహర్షి దృక్ ప్రసారం వల్ల తీరిపోయినవన్నమాట. కావలసిన సమాధానాలేవో ఆయన మనస్సులో రమణ ప్రసాదంగా అనుభూతి కల్గింది. అలా సద్గురువు మౌనంతోను శక్తి ప్రసారం చేయగలరు.

ఒక భక్తుడు సాయిబాబా పాద సంవాహనం చేస్తూ ఈ శ్లోకం చదువుతూ వుంటే "బాబా" దాని అర్థం అడిగాడు. భక్తుడైన "నానా" తనకు తెలిసిన అర్థం చెప్పాడు. అది బాబాకు తృప్తి కలగలేదు. నానా కోరిక మీద సాయిబాబా దానిని విశదీకరిస్తూ ఇలా చెప్పాడు – "దైవ సాక్షాత్కారం పొందడానికి గురువు యొక్క సేవ శిష్యుడు ఎలా చేయాలో ఈ శ్లోకం చెబుతున్నది. శిష్యుడు తన సమస్తమూ గురువుకు



అర్పించాలి. గురువును ఇరుకున పెట్టాలని ప్రశ్నలు వేయరాదు. నీ దేహాన్ని గురువు కర్పించావు కాబట్టి శరీరం నీది కాదన్న అనుభూతి కల్గాలి. ఇవన్నీ గురువుగారి అనుగ్రహాన్ని పొందడానికి అనుసరించేటటువంటి పద్ధతులు. గురుకృప అనే కలికం కంట్లో పెట్టుకో, మాయతెర తొలగిపోతుంది. ఈ విధంగా పల్కుతూ బాబా తాను ఎన్నో సంవత్సరాలు ఏ ప్రశ్నా వెయ్యకుండా, ఏ కోరికా కోరకుండా గురువుని సేవించానని చెప్పాడు. "రాధాబాయి" అనే వృద్ధురాలితో ఆమె మంత్రోపదేశం కోరినపుడు ఈ విధంగా తత్వోపదేశం చేశారు – "అమ్మా! నేను నా గురువుని ఎంతో కాలం సేవించాను. ఆయన నాకు ఏ మంత్రమూ ఉపదేశించలేదు. నేను అందుకోని దానిని నీకెలా అందించేది? తల్లీ! మోక్షమొక్కటే జన్మకు పరమార్థము. ఆత్మజ్ఞానం వల్ల అది లభిస్తుంది. అది మంత్ర తంత్రాల వల్ల లభ్యమయ్యేది కాదు. నీ మాటను, మనస్సును, చూపును, నీ ఇష్టములు, చేష్టలు అన్నింటిని నీ గురువునందు లగ్నం చేయి. సాధకుడు తాబేలు వంటివాడు. తల్లి తాబేలు, పిల్ల తాబేళ్లకు పాలు ఇవ్వదు. ఏ ఆహారమూ ఇవ్వదు. తన చూపులను ఒడ్డునున్న పిల్లల మీదికి ప్రసరింపచేస్తుంది. ఒడ్డున వున్న పిల్లలు వాటికవే చక్కగా పెరుగుతూ వుంటాయి. అలానే నా గురువు నా మీద ఆయన దృష్టి నిలిపారు. నేను నా మనస్సు ఆయన యందు నిలిపాను. ఇంక వేరే మాయలు, మంత్రాలు ఏమీ లేవు. నీవూ అలా చేయి". మహాపురుషులందరూ ఈ విధంగానే చెప్పారు. గురువు యొక్క అనుగ్రహం ఎలా పనిచేస్తుంది అన్న అంశాన్ని రమణమహర్షి ఎలా చెప్పారో చూడండి – వివిధ సందర్భాలలో భక్తులడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెబుతూ ఆయన పల్కిన వాక్యాలను సమీకరణ చేసి కొన్ని ఉదాహరిస్తాను.

గురువు అనేక విధాలుగా దీక్ష ఇస్తారు. జపము, మంత్రము మొదలైన వాటి ద్వారా. అన్నింటికంటే శక్తివంతమైన దీక్ష మౌనము. శాస్త్రములు ఎంతటివైనా గురువు యొక్క మౌనదీక్షతో సాటిరావు. మౌనియైన గురువు శాంతి, శక్తులను ప్రసరింపచేస్తూ నిరాడంబరంగా నెమ్మదిగా శిష్యుని హృదయంలో పరివర్తన తీసుకువస్తాడు. ఆధ్యాత్మిక మార్గంలో గురువు యొక్క అవసరము ఎంతైనా వుంది. అజ్ఞానాన్ని పోగొట్టే మహా గురువుకు శిష్యుడు శరణాగతుడు కావాలి. దేహాత్మదృష్టిని వదులుకోవడమే నిజమైన శరణాగతి. గురువు శిష్యుని ప్రపంచ వ్యవహారాలను కూడా స్వీకరిస్తాడా అంటే తప్పకుండా సంకల్పాలన్నీ స్వీకరిస్తాడు. గురువు శిష్యునకు కావలసిన ఆధ్యాత్మిక అవసరాలను మాత్రమే కాక సకల అవసరాలను తీర్చి, ఇహపరశ్రేయోదాయిగా గురువు వున్నారు.

మహావతార్‌బాబా, మహాప్రభూజీ, రామకృష్ణ పరమహంస, కృష్ణచైతన్యస్వామి, హరిదాస్ మహరాజ్, హితహరివంశ్ మొదలైన మహాపురుషులెందరో తమ శిష్యులను, భక్తులను అనుగ్రహించిన కథలు అసంఖ్యాకములు. గురువునే దేవతగా ఆరాధించినవారు, ఆశ్రయించిన వారు ఎలా తరిస్తారో ఈ సంఘటనల ద్వారా మనకు తెలుస్తుంది. గురువుని దేవునిగా భావించే ఈ సంప్రదాయానికి భారతదేశంలో ఎంతో ప్రధానమైన స్థానం వున్నది. *– శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానంద భారతీస్వామి వారి 'అమెరికాలో దేవతలు' నుండి గ్రహించబడినది*











భక్తులందరి దృష్టి వేదికపై నున్న స్వామిపై కేంద్రీకృతమై వుంది. స్వామి భక్తులవైపు తిరిగి ఈ చివర నుండి ఆ చివర వరకు సభామండపమంతా ఒకసారి కలయచూసారు. ఆ చూపు అంతమంది మీదికి ఒకొక్కరి మీద ఏదో విద్యుత్ కాంతి ప్రసారమైనట్లు, మెరుపు మెరిసినట్లు అవుతుంది. (నన్ను చూసారు స్వామి అన్న అనుభూతికి లోనవుతారు ప్రతివారు.) ఆ వీక్షణం ప్రసన్నాతి ప్రసన్నంగా, చంద్రుని నుండి వచ్చిన పండు వెన్నెలలా భక్తుల (బిడ్డల) హృదయాలను చూరగొంటున్నది. ఇది దర్శన మహిమ... దర్శన ప్రభావం.

- గురుకృప

మూర్తీభవించిన ప్రేమయే వారు,
సాయిభక్తుల హృదయ కమలమే వారు..
ప్రభవించిన పూర్ణభక్తియే వారు,
కడవరకు తోడుండు పరమాత్మయే వారు..
మది మరువలేనట్టి మహితాత్ములు
గురుదేవులు...

భువిపైన నడయాడు దైవమే వారు,
భవసాగరము దాటించు బంధమే వారు..
ఛాందసము చెండాడు వైతాళికుడు వారు,
పరిపూర్ణ జ్ఞాన సామ్రాజ్ఞమే వారు..
గమ్యమ్ము చేర్చేటి గురుచంద్రులు
గురుదేవులు...



ఆయనలా జీవించడమే మనము ఆయన్ను ఆరాధించడం
ఆ ప్రయత్నంలో మనకెప్పుడూ లభిస్తుంది వారి సాన్నిధ్యం.